
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 24 అక్టోబరు 2024 | 5

మరుపురాని నటుడు 'మాడా'

నేడు వర్ధంతి - వార్త 6లో



పంట పండింది!

● మొదలైన ఖరీఫ్ ధాన్యం మాసూళ్లు

● తుఫాను గండం తప్పినట్టే

● వర్షాలు రాకపోతే పండగే

● ఈనెలాఖరుకి కోతలు ముమ్మరం

● 220 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

● 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము వేస్తామని చెప్పి 24 గంటల్లోనే జమ

● దళారుల జోలికి వద్దు.. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని వినతి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ వరిపంట కోతలు మొదలయ్యాయి. తుఫాను ముప్పు తప్పి, వర్షాలు రాకపోతే జిల్లాలో ఈ ఏడాది అన్నదాతకు పండగ రోజులనే చెప్పాలి. గత ప్రభుత్వం అనేక తప్పు చేసి రైతులను ముప్పు తిప్పలు పెట్టిన సంగతి తెలిసిందే. ధాన్యం కొనేవారు లేక, ఎవరి ధాన్యం ఏ మిల్లులో కొంటారో అర్థం కాక, డబ్బులు ఎపుడిస్తారో కూడా తెలియని పరిస్థితిలో రైతులు గత రబీ వరకూ తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం బాకీ పడ్డ రబీ రైతుల డబ్బును కూడా ఈ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాక కోతలకు ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. పైగా గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులకు రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుందని చెప్పి, కూడా నెలల తరబడి వేసేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లోనే డబ్బు జమచేస్తామని రైతులకు భరోసా ఇచ్చింది. దానికి అనుగుణంగా ఇప్పటివరకు ముగ్గురు రైతులకు కేవలం 24 గంటల్లోనే డబ్బు జమచేసి ఓ రికార్డు సాధించింది. ఇక జిల్లాలో 72 వేల హెక్టార్లలో వరి పంట వేశారు. దీని నుంచి 5 లక్షల 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. సుమారు 70 వేల టన్నుల వరకూ రైతులు విత్తనాల కోసం, సొంత వినియోగం, స్థానికంగా అమ్ముకోవడానికి వినియోగించగా, మిగతా 4 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుంది. అందులో కస్టమ్ రైస్ మిల్లింగ్ కోసం పౌర సరఫరాల సంస్థ 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది. మిగతా ధాన్యం మిల్లర్లు, ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఇక్కడ రైతులు జాగ్రత్తగా అమ్ముకోవాలి. ప్రస్తుతం తుఫాను గండం తప్పినట్టేనని అధికారులు చెబుతున్నారు. ఇక వర్షాలు రాకపోతే దీపావళి నుంచి కోతలు ముమ్మరం అవుతాయి. నవంబరు చివరికి చాలా వరకూ కోతలు పూర్తవుతాయి. కానీ గోకవరం, కోరుకొండ, సీతానగరం, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల ప్రాంతాల్లో డిసెంబర్ మొదటి వారం వరకూ కోతలు ఉండవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అంచనా వేశారు. వాతావరణంలో ఏవిధమైన ఇబ్బందులు లేకపోతే ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రైతులు మధ్యవర్తులు, ఇతరులకు అమ్మేసుకోకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే మంచిధరతో పాటు డబ్బుకు వెంటనే చేతికి అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నల్లజర్ల, కొవ్వూరు ప్రాంతాల్లోని ముగ్గురు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ధాన్యం సొమ్ములు పూర్తిగా జమచేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ విధానం చరిత్రలోనే చూడలేదని, కేవలం 24 గంటల్లో డబ్బులు జమచేయడం ఒక రికార్డు అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల మండలంలోని ప్రకాశరావుపాలెంనకు చెందిన రైతులకు డబ్బులు జమకావడంతో ఆయన రైతును అభినందించారు.



ధర్మవరం రైతు సేవా కేంద్రంలో జేసీ చిన్నరాముడు

ధాన్యం సొమ్ము 48 గంటల్లో జమ : జేసీ

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమచేయడం జరుగుతుందని, తొలిసారి ఏకంగా 24 గంటల్లోనే సొమ్ము జమచేశామని చెప్పారు. కొవ్వూరు మండలం ధర్మవరం రైతు సేవా కేంద్రంలో 21, 22 తేదీల్లో ఇద్దరు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి వెంటనే ఆ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 48 గంటల్లో ధాన్యం సొమ్ము జమకావడం పట్ల రైతుల హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు. జేసీ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఉన్నారు.



ఉండ్రాజవరంలో పొట్ట దశలో వరిపంట.. గోపాలపురం మండలం చెరుకుమిల్లిలో ట్రాక్టర్‌లోకి ధాన్యాన్ని నింపుతున్న వరికోత యంత్రం

వాతావరణంలో మార్పులు.. దళారుల దందా

రాజమహేంద్రవరం రూరల్/ గోపాలపురం/పెరవలి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వరికోతలు మొదలయ్యాయి. గత వారంరోజులుగా రాజమహేంద్రవరం రూరల్ మండలంలో తొలుత ఊడ్చిన సన్నాలు రకం వరి కోతలు జరుగుతున్నాయి. ఆ సమయంలో బస్తా రూ.1700 చొప్పున కొనుగోలు చేశారు. తర్వాత వాతావరణంలో మార్పులు రావడంతో దళారులు, మిల్లర్ల ఏజెంట్లు రంగంలోకి దిగారు. రూ.1700కు కొన్న ధాన్యాన్ని రూ.1400కి తగ్గించేశారు. ఈ ప్రాంతంలో సన్నాలు రకాలు ఎకరానికి 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తోందని కోతలు కోసిన రైతులు చెబుతున్నారు. రూరల్ మండలం పరిధిలో తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గోపాలపురం మండలంలో కూడా ధాన్యం కొనుగోలులో దళారుల జోక్యం పెరిగిపోయింది. వాతావరణం మార్పులను అవకాశంగా తీసుకుని అయినకాడికి కొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఆరబెట్టిన ధాన్యం వంద కిలోల కామన్ రకం ధర రూ.2300కాగా, 75 కిలోలు రూ.1725 గిట్టుబాటు ధర ప్రకటించింది. అయితే పంటను కోసి అరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలంటే ఇప్పుడు సాధ్యమయ్యేలా లేదు. తుపాన్ల భయంతో ఏదోలా విక్రయించాలని రైతులు చూస్తున్నారు. పెరవలి మండలంలో ముదురుగా ఊడ్చిన వరిచేలు ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. అయితే మారిన వాతావరణ పరిస్థితుల వల్ల వీటిని ఆరబెట్టుకోవడానికి అవకాశం లేకపోవడంతో పచ్చిధాన్యంగానే విక్రయిస్తున్నారు. కోతలు మొదలైన తొలుత ఇక్కడ రూ.1340దాకా బస్తా రేటు పలికింది. అనంతరం రూ.1250కి దిగజారింది. ప్రస్తుతం మళ్లీ రేటు పెరిగి రూ.1420 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ మండలంలో ఎక్కువగా పీఎల్ రకం సాగు చేయడంతో ఈనెలాఖరు నాటికిగాని అవి కోతకు రావు. అప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు కూడా పనిలేకుండా పోయింది. రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ఎవరూ విక్రయించవద్దని పెరవలి వ్యవసాయాధికారి మేరీ కిరణ్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆరబెట్టుకొని అమ్ముకునే వాతావరణ పరిస్థితులు లేవని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



తక్కువ ధరకే ధాన్యం విక్రయించా..

నేను నాలుగు ఎకరాల్లో వరి వేశాను. త్వరగా కోతకు వచ్చే రకం కావడంతో 15 రోజుల కిందటే కోత కోశాను. అయితే ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేకపోవడంతో పచ్చి ధాన్యం విక్రయించాను. బస్తా రూ.1250కు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుతం రేటు పెరిగింది. కానీ సుమారు రూ.170 వరకు ఒక్కొక్క బస్తా మీద నష్టపోయాను.

- నందమూరి రామారావు, రైతు, తీపర్రు

చివర్లో ఎండాకు తెగులు దెబ్బ

ఉండ్రాజవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉండ్రాజవరం మండలంలో సార్వా వరిపంటపై ఎండాకు తెగులు సోకింది. దీంతో రైతులు తెగులు నివారణ చర్యలు చేపట్టారు. మండలంలో 11వేల ఎకరాల్లో సార్వా పంట వేశారు. ఎండాగు తెగులు వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలో స్వర్ణ, పీఆర్ 126 వరి రకాలను రైతులు వేశారు. ప్రస్తుతం ఎక్కువ శాతం పొట్టదశలో ఉన్నాయి. ముందుగా వేసిన వరి పంట నవంబరు రెండోవారం నాటికి కోతకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తరచూ వస్తున్న వర్షాలు, తుఫాను వంటి పరిస్థితుల పట్ల రైతులు ప్రస్తుతం బెంబేలెత్తిపోతున్నారు.



జిల్లా స్థాయి అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

నిబద్ధతతో సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

పీజీఆర్ఎస్ అర్జీలపై కలెక్టర్ సమీక్ష.. పీపుల్స్ తహశీల్దార్‌గా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, అక్టోబరు 23: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం ద్వారా ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటి పరిష్కారం ఎంతవరకు అయ్యిందనే అంశంపై కలెక్టర్ ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి దృశ్యమాధ్యమ సమావేశ మందిరంలో ఈ కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా సమస్య పరిష్కారం ఆర్డీవో, తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఎంతవరకు స్పందించారో అన్నదానిపై ఆధారపడి ఉంటుందన్నారు. అర్జీదారునికి అందుబాటులో ఉండడంతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేవిధానంబట్టే పరిష్కారం ఉంటుందన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు కలెక్టర్‌కి రావడంపై కలెక్టర్ ప్రశ్నించారు. ఇకపై టూర్ డైరీ సమర్పించే క్రమంలో క్షేత్రస్థాయిలో ఎన్ని పీజీఆర్ఎస్ అర్జీల పరిశీలన చేశారో నివేదికలో పొందుపరచాలన్నారు. ఇక నుంచి రెవెన్యూ అధికారుల సమావేశాలు డివిజన్ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల పరిష్కారానికి నిబద్ధత కలిగిన పరిష్కార తీరు ఉండాలన్నారు. రికార్డు ఆఫ్ రైట్‌కు అనుగుణంగా ఒక రెవెన్యూ అధికారి ఒక అర్జీని తిరస్కారం చేసిన తర్వాత తిరిగి అదే అర్జీలొస్తే పునఃపరిశీలన పరిధిలో ఉందో లేదో నిర్ధారణ చేయాలన్నారు. కొంత సమయం వెచ్చించి వారిని సంతృప్తి చెందేలా మాట్లాడి వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో చర్యలు తీసుకోవలసిన వాటికి అక్కడే స్పందన ఉంటే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు వారిని పిలిపించుకుని ఓపికగా వివరాలు తెలుసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. సమస్య తెలుసుకునే ప్రయత్నం మనం చేయగలిగితే తగిన న్యాయం చేకూరుతుందన్నారు. దిగువ స్థాయిలో పనిచేసే వారికి వారి పరిధి మేరకు పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టంచేయాలన్నారు. పీపుల్స్ తహశీల్దారులుగా రెవెన్యూ అధికారి పనితీరు ఉండాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు 1158 అర్జీలు రాగా వాటిలో 825 కలెక్టరేట్‌కు, 152 మండల స్థాయికి, ముఖ్యమంత్రి కార్యాలయానికి 23, ఉపముఖ్యమంత్రి ద్వారా 6, ఇతరుల దగ్గరకు 152 వచ్చాయన్నారు. రెవెన్యూశాఖపరంగా 42 అంశాలకు సంబంధించి అర్జీలు పరిష్కారం కోసం వచ్చాయని వాటిలో 10 అంశాలకు సంబంధించినవి 999 ఉండగా, మిగిలిన 32 అంశాలకు సంబంధించినవి 159 మాత్రమే ఉన్నాయని తెలిపారు. నాణ్యతతో కూడిన అర్జీలను పరిష్కారం చేయకపోవడం వల్లనే అర్జీలు రీ ఓపెన్ అవుతున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ సంబంధ ప్రజాఫిర్యాదుల అంశాలపై చర్చించి వాటికీ నిర్ణయాత్మకమైన పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్‌డీవోలు ఆర్. కృష్ణనాయక్, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏవో ఆలీ మహ్మద్, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కార్తీకం వస్తేగానీ.. రేవులను పట్టించుకోరా..

అపరిశుభ్రంగా ఘాట్లు.. డస్ట్ బిన్లూ నిల్.. నిరుపయోగంగా రుడా లాకర్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరానికి సాంస్కృతిక రాజధానిగా, ఆధ్యాత్మిక ధామంగా ప్రాశస్త్యం ఉంది. ఈ కీర్తిలో గోదావరి రేవులు కీలక భూమిక పోషిస్తున్నాయి. రోజూ వందలాది మంది యాత్రికులు నగరానికి వస్తూ గోదావరి నదిలో స్నానమాచరించి ఆలయాలను దర్శించుకుంటారు. అయ్యప్ప, భవానీ దీక్షల సమయంలో ఘాట్లు కళకళలాడుతుంటాయి. మరోవైపు నదుల పరిశుభ్రతకు ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే నగరపాలక సంస్థ మాత్రం అందుకు భిన్నంగా రేవులను అపారిశుధ్యంగా వదిలేస్తోంది. రేవులను పరిశుభ్రంగా ఉంచడానికి కార్తీక మాసం రాక గురించి ఎదురు చూస్తుండడంపై నగరవాసులు విస్మయం వ్యక్తం చేస్తుండగా.. రేవుల్లో కనీసం డస్ట్ బిన్లు కూడా లేని పరిస్థితిని చూసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ స్ఫూర్తి ఎక్కడంటూ యాత్రికులు ప్రశ్నిస్తున్నారు. గత పుష్కరాలకు గోదావరి రేవులను టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. దీనికోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. మెట్లు నిర్మించి యాంటీ స్కిడ్ (జారకుండా) టైల్స్ వేశారు. దేశంలోనే నిడివి కలిగిన వాటిలో మొదటి స్థానంలో కోటిలింగాల ఘాట్ నిలుస్తోంది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఘాట్ల నిర్వహణను వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అదే పరిస్థితి నడుస్తోంది. అటు కోటిలింగాల ఘాట్ మొదలుకొని ఇటు వీఐపీ ఘాట్ వరకూ ఎక్కడా సరిగా నిర్వహణ లేదు. కార్తీక మాసం వచ్చిన సమయంలో తప్ప పట్టించుకోవడం లేదు. గోదావరి స్నానానికి జనం ఎక్కువగా వచ్చే పుష్కరఘాట్‌లో అసలు డస్ట్‌బిన్లు లేవు. ఎక్కడి చెత్తను అక్కడే వేసేస్తున్నారు. రేవులో ఉన్న డస్ట్ బిన్లు మూలకు చేరాయి. ఒక్క స్పూను బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. గోదావరి నీళ్లలోని మెట్లు నాచుపట్టి జారుతుండడంతో యాత్రికులకు గాయాలు అవుతున్నాయి. గోదావరి నదిలో పూజాపత్రి, ప్లాస్టిక్ కవర్లు, దుస్తులు వేయడం, షాంపూలు, సబ్బులు వాడడం నిషేధం. గతంలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా మైకులో చెబుతూ ఉండేవాళ్లు. కానీ అవన్నీ ఆపేశారు. గోదావరి నిత్యహారతిని కూడా నిత్యం మమ అనిపిస్తున్నారు. ఇక్కడి సులభ్ కాంప్లెక్స్‌లో రూ.10 వసూలు చేస్తున్నారు. కోటిలింగాల, గణపతి, దుర్గా ఘాట్‌లలోనూ పరిస్థితి భిన్నంగా ఏమీలేదు. పుష్కరాల రేవులో యాత్రికుల కోసం రుడా 30 లాకర్లను ఏర్పాటు చేసింది. ఇవి ఎందుకు ఏర్పాటు చేశారో కూడా చెప్పేనాథుడు కరువయ్యాడు. గోదావరి గట్టున శ్రీస్వామి అయ్యప్ప దేవాలయం పక్కనే రేవు ఉంది. ఇక్కడ నదీ జల కాలుష్య నివారణ పథకం కింద భవనం నిర్మించారు. పైఅంతస్తులో మరుగుదొడ్లు, కింద స్త్రీలు దుస్తులు మార్చుకొనే గదులు ఏర్పాటుచేసి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.

అయోమయం..

గందరగోళం



కొవ్వూరు ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో తవ్వకాలు.. సీనరేజీ, జీఎస్టీతో కలిపిన ఇసుక రవాణా బిల్లు



AP SAND MANAGEMENT SYSTEM

SAND RECEIPT

: 22-10-2024 12:01:58 PM, Delivery date : 22-10-2024

: 20 (MT)

: 10-Tyre Truck

: 38.15 KM

: Aurangabad Km 5.808, East Godavari District

: 437314

	Quantity (MTs)	Price (₹ Per MT)	Total (₹
of sand	20	0	
ders	20	240.57	4,81
s	20	88.00	1,76
n charges			6,87
Total Taxable Value			13,44
CGST@2.5%			33
SGST@2.5%			33
Total Paid Amount			₹ 14,12

సీనరేజీ, జీఎస్టీ రద్దుపై నిర్ణయం అమలులోకి ఎప్పుడో..

కొనసాగుతున్న ఇసుక దందాలు

ఆన్‌లైన్‌లో ఇప్పటికీ నోస్టాక్ బోర్డు

గోదారి గట్టున మాత్రం గుట్టలుగుట్టలు

కన్నెత్తి చూడని అధికార గణం

ఇప్పటికైనా మార్పు ఉంటుందా

కొవ్వూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక ఇంకా గందరగోళంలోనే ఉంది. ఎక్కడ ఏం జరుగుతుందో తెలియకుండా అంతా అయోమయంగా కనిపిస్తోంది. అక్కడ రోజూ సీఎం చంద్రబాబు చెబుతున్నారు.. ఇక్కడ జనం వింటున్నారు అంతే. ర్యాంపుల్లో మాత్రం జరిగేది జరిగిపోతోంది. ఇప్పటికీ ఇసుక ధరలో మార్పు లేదు. దందాలో మార్పులేదు. ఇసుక కావాలంటే మామూలు ఇస్తేగాని ఇసుక అందని పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక అక్రమార్కులు ఇష్టానుసారం ఇసుక విక్రయాలు చేస్తున్నారు. ఎప్పుడు ఇసుక ర్యాంపులు విడుదల చేస్తారోనని భవన నిర్మాణ కార్మికులు ఎదురుచూశారు. సీఎం చంద్రబాబు ఇసుక ఉచితం అన్న వెంటనే అందరిలో ఆనందం కనిపించింది. తీరా ఇసుక సరఫరా చేసే సమయం వచ్చేసరికి ధరల్లో పెద్ద తేడా లేదు. ట్రాన్స్‌పోర్టు ఖర్చు, సీనరేజీ అని, జీఎస్టీ, మామూళ్లు అంటూ 20 టన్నుల ఇసుకకు రూ.20 వేలు లాగేస్తున్నారు. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో 16 ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. 119 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. 9 డిసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. ప్రస్తుతం డిసిల్టేషన్ ర్యాంపుల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక సరఫరా జరుగుతోంది. సర్కారు విధానం ప్రకారం ఆయా ర్యాంపుల నుంచి కొనుగోలుదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఇసుక పొందవచ్చు. కానీ ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినా నోస్టాక్ బోర్డులే కనిపిస్తున్నాయి. దీంతో ఇసుక వినియోగదారుడు ఏ ర్యాంపులో ఇసుక ఉందని తెలిస్తే ఆ ర్యాంపులో ఇసుక బుక్ చేసుకుంటున్నాడు. రాజమహేంద్రవరం వినియోగదారుడు ఇసుక బుక్ చేసుకోవాలంటే ఔరంగాబాద్, వాడపల్లి ర్యాంపుల్లో ఇసుక ఉన్నట్టు చూపిస్తోంది. రాజమహేంద్రవరం ర్యాంపుల్లో నోస్టాక్ బోర్డులే కనిపిస్తున్నాయి. దీంతో వినియోగదారునిపై ట్రాన్స్‌పోర్టు చార్జీల రూపేణా అదనపు భారంపడుతోంది. ఈ నేపథ్యంలో 20 టన్నుల ఇసుక లారీ అన్ని ఖర్చులు కలుపుకుని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలకడం గమనార్హం. ఇది కాకుండా మామూళ్లు అదనం. దీనిపై కొనుగోలుదారుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాడు.

సీనరేజీ, జీఎస్టీ రద్దు...

సీనరేజీ, జీఎస్టీ రద్దు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటన చేశారు. కేబినెట్ కూడా ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటికీ కూడా ఇసుకపై సీనరేజీ, జీఎస్టీ వసూలు చేస్తూనే ఉన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే ఇంకా తమకు ఎటువంటి ఆదేశాలూ రాలేదని చెబుతున్నారు. దీంతో 20 టన్నుల లారీ వినియోగదారునిపై జీఎస్టీ రూ.672, సీనరేజీ రూ.1760 చెల్లించాల్సి వస్తోంది.

గుట్టలు గుట్టలుగా ఇసుక

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, సీతానగరం, కడియం, నిడదవోలు, పెరవలిలలో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. జిల్లా చుట్టూ 10 కిలోమీటర్ల దూరంలోనే ఇసుక బుక్ చేసుకునే విధంగా అందుబాటులో ర్యాంపులు ఉన్నాయి. దాంతోపాటు ఎక్కడికక్కడ గుట్టలు గుట్టలుగా ఇసుక కూడా ఉంది. ఆన్‌లైన్‌లో మాత్రం దూర ప్రాంతాల్లో ఉన్న ర్యాంపులు దర్శనమిస్తున్నాయి. దీంతో రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. మంగళవారం దివాన్‌చెరువుకు చెందిన వినియోగదారుడు ఇసుక బుక్ చేసుకుంటే కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్ ర్యాంపు చూపించింది. దివాన్ చెరువు నుంచి ఔరంగాబాద్‌కు సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రవాణా చార్జీల కింద రూ.6876లు వసూలు చేశారు. అదేపక్కనే ఉన్న రాజమహేంద్రవరం ర్యాంపుల్లో ఇసుక కేటయించి ఉంటే రవాణా చార్జీలు సగానికి తగ్గేవి. దూర ప్రాంతాల్లోని ర్యాంపులను కేటయించడం వల్ల ట్రాన్స్‌పోర్టర్‌కు లాభం చేకూర్చినా, వినియోగదారుడు మాత్రం నలిగిపోతున్నాడు.

ఇసుక కావాలంటే అదనం

ఇసుకకు బిల్లు మొత్తం చెల్లించామన్నా మాకేంటి సంబంధం.. మీరు మాకు మామూళ్లు కట్టాల్సిందేనని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ర్యాంపులకు అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో అక్రమార్కుల దందా శృతిమించుతోంది. లారీ ర్యాంపు దాటి బయటకు రావాలంటే రూ.1000 చెల్లించాల్సిందే. ఆ మొత్తం చెల్లించకపోతే లారీ కూడా లోడ్ చేయడం లేదు. దూరప్రాంతాలకు సరఫరా చేయాలంటే అదనంగా మామూళ్లు ఇవ్వవలిసిందేనని పట్టుబడుతున్నారు. ఇసుక అత్యవసరమైన వినియోగదారులు తప్పనిసరి పరిస్థితిలో వెయ్యి నుంచి రూ.2 వేలు అదనంగా చెల్లించి ఇసుకను తీసుకువెళ్తున్నారు.

అధికారగణం ఎక్కడ..

ఇంత జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అసలు ర్యాంపుల్లో ఏం జరుగుతుందో పర్యవేక్షించే అధికారి కనిపించడం లేదు. ఇదే అదనుగా చూసుకుని అక్రమార్కులు బిల్లులు లేకుండా ఇసుక తరలించిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై ఓ అధికారికి సమాచారం అందించగా రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదుచేయాలని సూచించినట్టు సమాచారం. గతంలో ఇసుక ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా జరిగితే ఎస్ఈబీతోపాటు విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ర్యాంపుల్లో లారీలో ఎంత ఇసుక లోడ్ అవుతోంది, బిల్లు ఉందా లేదా, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా అని పర్యవేక్షించడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు అందినకాడికి దోచుకుంటున్నారు. ర్యాంపుల్లో బహిరంగంగా లావాదేవీలు జరుగుతున్నా అధికారులు, కూటమి నేతలు పట్టించుకోవడం లేదు.

ఇవిగో ఉదాహరణలు

రాజమహేంద్రవరం దివాన్‌చెరువుకు చెందిన లక్ష్మణ్ సందీప్ ఇంటి నిర్మాణం కోసం ఈనెల 22వ తేదీన 20 టన్నుల ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. దీనికిగాను ఇసుకకు సంబంధించి రూ.6571, రవాణాకు సంబంధించి రూ.6876, జీఎస్టీ చార్జీలు రూ.672 కలిపి రూ.14,120 ఆన్‌లైన్‌లో చెల్లించారు. అయితే బుధవారం లారీ డ్రైవర్ ఫోన్‌చేసి కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో ఇసుక లోడ్‌కు వచ్చాను. లోడ్ చేయడానికి ఇసుక గుట్ట యజమాని అదనంగా రూ.1000 అడుగుతున్నాడు. గామన్ బ్రిడ్జి పై నుంచి రావాలంటే టోల్‌ఫీజు అదనంగా చెల్లించాలని వినియోగదారునికి ఫోన్ చేశాడు. దీంతో గుట్ట యజమానికి రూ.1000 చెల్లించి ఇసుక లోడ్ చేసుకుని వెళ్లారు. అలాగే తాళ్లపూడి మండలానికి చెందిన సిద్దూ అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇసుక కోసం గత పది రోజులుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసేందుకు ప్రయత్నిస్తే నోస్టాక్ అని వచ్చింది. రెండుసార్లు ఓటీపీ చెప్పినా బుక్ అవ్వలేదు. చివరికి ఇసుక ర్యాంపులో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని ఆశ్రయించగా ఆన్‌లైన్‌లో బుక్ చేసి ఇసుక పంపించాడు.



మరపురాని నటుడు 'మాడా'

- సినీనటుడు మాడా వెంకటేశ్వరరావుది మన దుళ్లే
- ఇంజనీర్ నుంచి యాక్టర్ దాకా ప్రస్థానం
- హాస్యమిళితమైన నటనలో మేటి
- నేడు వర్ధంతి

హాస్యనట చక్రవర్తుల్లో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం కడియం మండలం దుళ్ల. ఇంజనీరింగ్ చదివినా నటనపై ఆసక్తితో సినీరంగంలోకి వెళ్లి రాణించారు.

(కడియం-ఆంధ్రజ్యోతి)

సినీజగత్‌కు హేమాహేమీలను అందించిన ఘనత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సొంతం. ఎంతోమంది నటీనటులు ఇక్కడి నుంచే సినీరంగంలోకి వెళ్లారు. తెలుగు చలనచిత్ర సీమలో తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. వారిలో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. 'చూడు పిన్నమ్మ-పాడు పిల్లాడు' సాంగ్‌తో ఉభయ తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన నటుడు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలం దుళ్ల గ్రామం. మాడా పేరు చెబితే 'బాయా' అనే డైలాగు, 'చూడు పిన్నమ్మ పాడు పిల్లాడు' అనే పాట వెంటనే గుర్తుకొస్తుంది. దుళ్ల గ్రామంలో మాడా వీరభద్రుడు-అమ్మన్న దంపతులకు రెండో సంతానంగా 1935 జూన్ 4న మాడా వెంకటేశ్వరరావు జన్మించారు. మాడా వెంకటేశ్వరరావు కుటుంబం పెద్దదే. ఆయనకు అన్నయ్య, చెల్లి, ముగ్గురు అక్కలు ఉన్నారు. మాడా వెంకటేశ్వరరావు బాల్యం అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సాగింది. ఆయన ప్రాథమిక విద్య, హైస్కూల్, రాజమహేంద్రవరం, మండపేటల్లో సాగింది. అటుపై కాకినాడలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు.





మాడా వెంకటేశ్వరరావు.. దుళ్లలో ఉన్న ఇల్లు

ఇంజనీరింగ్ పట్టా పొందిన తర్వాత ఇంజనీరుగా జీవితం ప్రారంభించారు. ఆ వెంటనే ఆయనకు వివాహం జరిగింది. నలుగురు కుమార్తెలు కూడా. అయితే చిన్ననాటి నుంచి నాటకరంగంపై మక్కువ పెంచుకున్న మాడా ఇంజనీర్‌గా ఉంటూనే సినీరంగంలో ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నం ఫలించి 'సుడిగుండాలు' సినిమాలో ఆయనకు అవకాశం దక్కింది. అప్పటి నుంచి సినీనటునిగా తనదైన శైలిలో పాత్రలు పోషిస్తూ తెలుగు ప్రేక్షకులను అలరించారు. ఒక ఇంజనీర్ తనకున్న లక్ష్యాన్ని సాధించడంలో సఫలమై నటుడిగా కూడా సక్సెస్ అయ్యారు. తెలుగు సినిమాలో బృహన్నల పాత్రలు చేయడంలో మాడాకు మరెవరూ సాటిలేరు. హాస్యాన్ని పండిస్తూ బృహన్నల హావభావాలను వ్యక్తపరచడంలో మాడా వెంకటేశ్వరరావుది విభిన్నమైన శైలి. తన అద్భుతమైన నటనతో హాస్యమిళితమై ప్రేక్షకులను అలరింపజేశారు. కథ సీరియస్‌గా నడుస్తున్న కొన్ని ఘట్టాల్లో మాడా ఎంట్రీతో హాస్యాన్ని పండించే పాత్రలు అనేకం రంజిపజేశాయి. మాడా 'సుడిగుండాలు' సినిమా మొదలు వెయ్యికి పైగా సినిమాలు నటించి తనదైన శైలి సృష్టించారు. జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన నటుల్లో మాడా ఒకరు. ఆయన వర్ధంతి నేడు.

ప్రపంచ పోలియో దినం



పోలియోకు సెలవు!

పోలియో అంటేనే.. ఒక విషాద జీవితం. బతికినన్నాళ్లూ కష్టాలతోనే కొనసాగాలి. ఇటు కన్నవారికీ, అటు పోలియోతో బాధపడేవారికీ నరకమే. కళ్లనిండా దుఃఖాన్ని మోస్తూ బతకాలి. ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల తరబడి కృషి సాగింది. పోలియో చుక్కలు కచ్చితంగా వేయడం ద్వారా ఈ మహమ్మారి నుంచి భారత్ కూడా బయటపడింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలియో కేసులు నమోదు కావడం లేదు. ఏటా పోలియో చుక్కల కార్యక్రమం క్రమంతప్పకుండా జరుగుతోంది. నిజంగా ఈ పోలియో వ్యాధిని నిర్మూలించడం మానవాళి సంఘటితంగా సాధించిన గొప్ప విజయం. గురువారం ప్రపంచ పోలియో దినం సందర్భంగా కథనం.

- గత 15 ఏళ్లుగా కేసులు జీరో
- పల్స్ పోలియోతో సాధించిన విజయం ఇది
- ఫలించిన ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషి
- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత

(రాజమహేంద్రవరం అర్బన్/ ముమ్మిడివరం -ఆంధ్రజ్యోతి)

పోలియోను పూర్తిగా పారదోలినట్టు వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే ప్రకటించింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదుకావడం లేదు. నిరంతరాయంగా పోలియో చుక్కల కార్యక్రమం ద్వారానే ఇది సాధ్యపడిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 2014లోనే మన రాష్ట్రంతో పాటు దేశం మొత్తం పోలియోఫ్రీగా నిర్ధారిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరణ ఇచ్చింది. అయితే ఇప్పటికీ కొన్ని దేశాల్లో పోలియో కేసుల నమోదు ఉండడంతో మన దేశంలో కూడా ముందు జాగ్రత్తగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తూ వస్తున్నారని చెబుతున్నారు. ప్రతి ఏటా జనవరి నెలలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నారు. గర్భిణీలకు ముందస్తుగా చేసే రక్త పరీక్షల సందర్భంలో కూడా ఎలాంటి పోలియో అనుమానిత కేసులు నమోదు కావడం లేదని వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. ఏటా జనవరి నెలలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమైన తర్వాత దాదాపు నెలరోజులపాటు ఐదేళ్లలోపు చిన్నారులందరినీ వెతికి మరీ వారికి చుక్కలు వేస్తున్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సైతం స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఎక్కడా పోలియో కేసు నమోదు కాకపోవడానికి ప్రధాన కారణమని వైద్యాధికారుల అభిప్రాయం. పల్స్‌పోలియోకు ముందు ఇంటింటి సర్వే చేయడంతోపాటు చిన్నారులు ఉన్న ఇంటిని చాక్‌పీస్‌తో మార్కు చేస్తారని, ఎవరైనా ఊరికి వెళితే వాళ్లు వచ్చేవరకూ ఫాలోఅప్ చేస్తూనే ఉంటారని, దీనివల్లే పోలియో నిర్మూలన సాధ్యమైందని వారు చెబుతున్నారు. ఇటు ప్రభుత్వం, అటు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడమూ ఈ మహమ్మారిని తుదముట్టించడానికి దోహదపడింది. ఇక గతంలో పల్స్ పోలియో కార్యక్రమం ఏడాదికి రెండుసార్లు జరిగేది. తర్వాత జనవరి నెలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇదికాకుండా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో నిర్మూలనకు రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో నెలలో ప్రతీ బుధవారం, శనివారం జరుగుతోంది. పోలియో ఇమ్యునైజేషన్‌లో రెండు రకాల వ్యాక్సిన్లు వేస్తారు. ఓపీవీ (ఓరల్ పల్స్ పోలియో) చుక్కలు పుట్టినబిడ్డకు వెంటనే, ఆరువారాలు, పది వారాలు, 14 వారాలకు వేస్తారు. ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్)ను 6 వారాలు, 14, 9 నెలలు నిండిన తరువాత పిల్లలకు వేస్తారు. కలుషితనీరు తాగడం, బహిరంగ మలవిసర్జన వల్ల పరిసరాలు, మంచినీరు కలుషితమై ఈ పోలియో వ్యాధి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో గత 15 ఏళ్లుగా ఒక్క పోలియో కేసు నమోదుకాలేదు. దేశంలోనూ కేసులు లేకపోవడంతో పోలియో రహిత దేశ జాబితాలో ఉంది.



గిరిజన గ్రామం.. ఊరంతా ఉద్యోగులే!

ఆర్కూర్ గ్రామం విశిష్టత

సాధారణంగా ఒక గ్రామంలో ఒకరో ఇద్దరో ప్రభుత్వోద్యోగులుంటారు. మహా అయితే పట్టుమని పదిమంది కూడా ఉండొచ్చు. కానీ ఆ గిరిజన గ్రామంలో ఏకంగా వంద మందికిపైగా ప్రభుత్వ కొలువులు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. కూనవరం మండలం ఆర్కూర్ గిరిజన గ్రామంలో సుమారు 100కు పైగా గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాయకష్టంతోపాటు ఆగిరిజన గ్రామానికి చదువు విలువ తెలుసు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీలు పడి మరీ విజయం సాధిస్తున్నారు.

మొదట గురువు ఆయనే..

ఆ గ్రామంలో మొదటగా ప్రభుత్వ ఉద్యోగం చేసింది చిచ్చడి రాజయ్య అని ఆర్కూర్ గ్రామానికి చెందిన గిరిజనులు చెప్పారు. తొలి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగం నిర్వహించారని రూ.3.75 పైసలతో అప్పట్లో జీతం తీసుకునేవాడని చెప్పేవారు. ఆయన స్ఫూర్తితోనే ఇక్కడ యువత ఉద్యోగం చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తిగా ఇప్పుడు ఆ గ్రామంలో 43 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇక పోలీస్ శాఖలో ఎనిమిది మందికిపైగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో మహిళా పోలీసులు ఉన్నారు. వెటర్నరీ డిపార్టుమెంట్‌లో ఏడుగురు, హెల్త్ డిపార్టుమెంట్‌లో 12 మంది, అంగన్‌వాడీలో ఇద్దరు, ఆర్టీసీలో ఒకరు, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, ఫీల్డు అసిస్టెంట్లుగా ముగ్గురు, స్కూల్ ఆఫీస్ వర్కర్లుగా ఐదుగురు, పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, బ్యాంకులో ఒకరు, వెల్ఫేర్ అసిస్టెంట్లుగా ఇద్దరు, డిజిటల్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్లుగా ఇద్దరు, అగ్రికల్చర్ సెరీ కల్చర్‌లో ఇద్దరు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా ఒక్కరు, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఇద్దరు చేస్తున్నారు. వీరితోపాటు వివిధ సచివాలయాల్లో ఉద్యోగులుగా ఈ గ్రామానికి చెందినవారు ఉండడం గమనార్హం. ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఆర్కూర్ గ్రామం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. అంతేకాకుండా ఈ గ్రామానికి చెందిన రాబోయే యువత సైతం ఉద్యోగాల వేటలో ఉన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

నా ఊరే నాకు ఆదర్శం..

- పాయం కన్నారావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



మా ఊరులో ఇంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గర్వకారణం. నేను పేదరికం వల్ల రాత్రి బడిలో అక్షరాభ్యాసం చేశా. అనంతరం గురుకుల పాఠశాలకు ఎంపికై అక్కడి నుంచి ఉపాధ్యాయులకు కావాల్సిన అర్హత సాధించా. ఇప్పుడు మా ఊరులో వందమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రాబోయే యువత కూడా ఇదే మార్గంలో వెళ్లాలి.

- ఆంధ్రజ్యోతి/కూనవరం



సోలార్ ప్యానళ్లు పట్టుకుపోవడంతో ఖాళీగా ఉన్న స్టేండ్

మూలకు చేరిన..

సాగర సమాచార కేంద్రం

- తుఫానులు, మత్స్య సంపద లభ్యతపై సమాచారం కోసం ఏర్పాటు
- నిరుపయోగంగా పరికరాలు
- మత్స్యకారులకు అందని సేవలు



సాగర సమాచారాన్ని తెలిపే డిస్‌ప్లే బోర్డు

తొండంగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారలకు తుఫాను హెచ్చరికలు చేరవేసేందుకు, మత్స్య సంపద లభ్యత గురించి సమాచారం ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన సాగర సమాచార వ్యవస్థ(ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం) మూలకు చేరి నిరుపయోగంగా మారింది. తొండంగి మండలం తీరప్రాంత గ్రామమైన దానవాయిపేటలో గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా అందే సమాచారాన్ని 100 నుంచి 150 కిలోమీటర్ల మేర సముద్రంలో వేట సాగించే మత్స్యకారలకు అందించే అవకాశం ఉంది.దీని కోసం బోట్లలో ఉన్న ప్రత్యేక పరికరాలు వారికి ఉపయోగపడేవి. తుఫానుల సమయంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు, వారికి వాతావరణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ చక్కగా ఉపయోగపడేది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా మత్స్యకారలకు సేవలు అందేవి. తుఫానుల సమయంలో విద్యుత్ లేకున్నా ఉపయోగపడేలా సోలార్ సిస్టం ద్వారా పనిచేసేలా దీన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం భవనంపైన సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు ఏర్పాటు చేశారు. కేంద్రంలో స్ర్కీన్‌తో కూడిన డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. కొంతకాలం దీన్ని సక్రమంగా నిర్వహించిన మత్స్యశాఖ మరమత్తు రావడంతో పట్టించుకోవడం మానేసింది. దీంతో విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి.భవనంపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లను కొందరు దొంగిలించుకుపోయారు. మత్స్యకారులకు అత్యం త అవసరమైన ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని, ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న సోలార్ బ్యాటరీలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామికి లక్షతులసీ పూజ దృశ్యం

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

- మూడోరోజు సుప్రభాత సేవ, అష్టోత్తర శతకలశాభిషేకం
- వేంకటేశ్వరస్వామి హోమం

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేదమంత్రాలు... మేళతాళ మంగళవాయిద్యాలు.. కళాకారుల ప్రదర్శనలు.. భక్తజన గోవిందనామస్మరణల నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నవనీత హారతి, సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, విశేష అర్చన, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అష్టోత్తర, శతకళశాభిషేకం స్వా మివారి మూలవిరాట్‌కు లక్షతులసి పూజ, ప్రధా న హోమాలు వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు వేంకటేశ్వస్వామి హోమం, భక్తజనం గోవిందనామస్మరణలు వేద పండితులు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, ఫలపుష్పాలంకరణ, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శనల నడుమ స్వామివారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహించారు. అనంతరంరాత్రి శ్రీవారు కోదండరామ అలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించిన హనుమత్‌వాహనంలో ఆశీనులయ్యారు.



స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



శక్తివేషాలతో అలరిస్తున్న దృశ్యం

భక్తజన గోవిందనామాల నడుమ వేలాది మంది భక్తులు తిరువీధులలో స్వామివారి వాహనసేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో ముదునూరివెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు కాయల జగన్నాథం-మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



వాడపల్లి శ్రీవారికి సింహవాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, తిరుప్పావడ సేవ, యోగనారసింహ అలంకరణతో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అబ్బో.. ఎన్ని తేనెపట్లో

- కొమ్మ.. కొమ్మకూ ఒకటి
- జేఎన్టీయూకేలోని ఒకే చెట్టుకు అనేక తేనెపట్లు

జేఎన్టీయూకే, అక్టోబరు 23: సాధారణంగా తేనెపట్లు అటవీ ప్రాంతాల్లోని చెట్లకు ఎక్కువగా పడుతుంటాయి. పెద్ద రాళ్లకు, భవనాలకు కూడా పట్టడమే కాకుండా వాటిలో ఉండే తేనె చాలా నాణ్యతగా ఉంటుంది. ఎక్కడైనా కానీ ఒకటి లేదా రెండు తేనెపట్లు మాత్రమే పట్టడం చూస్తాం. కానీ కాకినాడ జేఎన్టీయూకే ఆవరణలోని ఫార్మసీ విభాగం ఎదురుగా బాలికల వసతిగృహం పక్కన గల ఓ మర్రి చెట్టు కొమ్మలకు ఎక్కువ తేనెపట్లు పట్టాయి. దీంతో అబ్బో ఆ చెట్టుకు ఎన్ని తేనె పట్లు పట్టాయో అని చూసిన ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, వర్సిటీకి వివిధ పనుల మీద బయటి నుంచి వచ్చేవారు, ఆ చెట్టు పక్కనున్న రోడ్డుపై వెళ్లేటప్పుడు ఆ తేనెపట్లులను ఆగి మరీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.









దేవాలయాల్లో కార్తీక మాస పూజలు, ఏర్పాట్లపై దేవదాయ శాఖ ఉప కమిషనరు సమీక్ష

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాలయాల్లో ఏర్పాట్లపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు సమీక్షించారు. కాకినాడ రామారావుపేటలోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని శివాలయాల ఈవోలు, జిల్లా అధికారులు, కార్యాలయాల పర్యవేక్షకులు హాజరయ్యారు. ఆయా దేవాలయాల్లో భక్తుల రద్దీ, తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఉప కమిషనరు కార్యాలయ పర్యవేక్షకుడు వి.సోమరాజు, జిల్లా దేవాలయాల శాఖాధికారి అల్లు భవాని పాల్గొన్నారు.



వ్యానెక్కిన పడవ

నీటిలో ఉండాల్సిన పడవ వ్యానెక్కింది. కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని తీర ప్రాంత గ్రామమైన గోపాలపట్నం నుంచి వేరే ప్రాంతంలో వేట సాగించేందుకు మత్స్యకారులు పడవను బుధవారం వ్యానుపై తీసుకు వెళ్తున్నారు. దీనిని దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

- తొండంగి (ఆంధ్రజ్యోతి)

ప్రముఖ వైద్యుడు డాక్టర్ తేతలి కన్నుమూత



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ డీసీహెచ్ఎస్, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ (రిటైర్డు) డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు (79) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరం దానవాయిపేటలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సివిల్ సర్జన్‌గా గోదావరి జిల్లాల్లో ఆయనకు ఎంతో పేరుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడిగా పని చేసిన సమయంలో వేలాది మందికి ప్రాణదానం చేసి పేదల హృదయాల్లో దేవుడిగా నిలిచారు. 1945 ఆగస్టు 29న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన వెంకటేశ్వరరావు కర్నూలు వైద్య కళాశాలలో మెడిసిన్ చదివారు. అనేక హోదాల్లో పనిచేశారు. 1993లో సివిల్ సర్జన్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆయనమంచి వైద్య సేవలందించడం ద్వారా అనతికాలంలోనే ప్రజలకు దగ్గరయ్యారు. డాక్టర్ తేతలి మరణవార్త తెలుసుకున్న అనేక మంది వైద్యులు, నగర ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారంరాజమహేంద్రవరం కోటిలింగాలు కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయి.

నాలుగు గంటలు... హైడ్రామా

- పెద్ద చెరువు ఆక్రమణదారులకు పంచాయతీ నోటీసులు జారీ చేయడంపై నిరసన
- వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు పాల్పడతానని యువకుడి బెదిరింపు
- అధికారులు, పోలీసుల హామీతో దిగివచ్చిన వైనం



వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేస్తానని బెదిరిస్తున్న శ్రీనివాస్

మండపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో పంచాయతీకి చెందిన పెద్ద చెరువు ఆరు ఎకరాల్లో విస్తరించి ఉంది. దాని చుట్టూ వున్న గట్టును ఆక్రమించుకుని 46 మంది నివాసం ఉంటున్నారు. ఈ చెరువును రూ.2.5 కోట్లతో పార్కుగా అభివృద్ధి చేసేందుకు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించాలంటూ వారికి పంచాయతీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఆక్రమణదారుల్లో 16 మంది ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్థలాలు పొందారు. మరో 30 మందికి ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. అయితే చెరువు గట్టు ఇళ్లకు సంబంధించి ఎటువంటి సంబంధం లేని గ్రామానికి చెందిన యువకుడు రామిశెట్టి శ్రీనివాస్ బుధవారం ఉదయం 7.30 గంటలకు చెరువు గట్టున ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కాడు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా ఆత్మహత్యకు పాల్పడతానంటూ హైరానా చేశాడు. 11 గంటల వరకు హైడ్రామా నడిచింది. వాటర్ ట్యాంకు పైనుంచి దూకేస్తానని, ఆక్రమణలు తొలగించమంటూ తనకు పంచాయతీ నుంచి లేఖ కావాలని పట్టుబట్టాడు. దీంతో లేఖ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ముందుకొచ్చారు. మండపేట రూరల్ ఎస్ఐ అక్కడకు చేరుకుని ట్యాంకుపై ఉన్న యువకుడిని కిందకు దింపే ప్రయత్నం చేశారు. పంచాయతీ సిబ్బంది, స్థానికులు పోలీసులు సంయుక్తంగా చేసిన ప్రయత్నం ఫలించింది. ఉదయం 11 గంటలకు అధికారులు, స్థానికుల కోరిక మేరకు యువకుడు వాటర్ ట్యాంకు పైనుంచి దిగి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కిందికి దిగివచ్చి అనంతరం యువకుడు విలేకరులతో మాట్లాడాడు. తన సమీప బంధువు, వరుసకు పిన్నికి చెరువు గట్టున ఇల్లు ఉందని, దానిని తొలగిస్తామని పంచాయతీ నోటీసు ఇవ్వడంతో తాను వాటర్ ట్యాంకు ఎక్కానని చెప్పాడు.

కాగా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో యువకుడిని మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సుదీర్ఘ కాలం నుంచి తామంతా చెరువు గట్టుపై సొంతంగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, పార్కు నిర్మాణం కోసం వాటిని తొలగిస్తే తమకు దారేంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు ఎకరాల్లో విస్తరించి వున్న చెరువు ఎకరంపైగా ఆక్రమణలకు గురైందన్నారు. సర్వే అనంతరం పార్కు నిర్మాణం కోసం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అంతేతప్ప ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు.



శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్క్

'దానా' తుఫాన్ ఎఫెక్ట్

రైల్వే హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వెంబడి 'దానా' తుఫాను ప్రభావంతో కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని తీవ్ర ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు ఎప్పటికప్పుడు సత్వర సమాచారం తెలుసుకునేందుకు విజయవాడ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు రైల్వే పీఆర్వో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందింది.

స్టేషన్	హెల్ప్ డెస్క్ నెంబరు
సామర్లకోట	0884-2327010
రాజమహేంద్రవరం	0883-2420541
తుని	08854-252172
తాడేపల్లిగూడెం	08818-226162
భీమవరం టౌన్	78159 09402
ఏలూరు	75693 05268
అనకాపల్లి	75693 05669
గూడూరు	0862-4250795
నిడదవోలు	08813-223325
ఒంగోలు	8592280306
తెనాలి	86442 27600
గుడివాడ	78159 09462,
నెల్లూరు	0861-2345863
విజయవాడ	0866-2576924



నూతన కార్యవర్గ సభ్యులతో ఏపీ ఎన్జీవో నాయకులు

ఏపీ జీఎన్ఏ జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి, కార్యదర్శిగా గట్టు ప్రమోద, కోశాధికారిగా కాకి వెంకటపరమేశ్వరి విజయం సాధించారు. కాకినాడ జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏపీ ఎన్జీవో నాయకులు బలపరిచిన బూరిగ విజయలక్ష్మి తన ప్రత్యర్థి ధనలక్ష్మిపై 39 ఓట్ల ఆధిక్యతతో అధ్యక్షురాలిగా గెలుపొందారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి తన ప్రత్యర్థి అంజలి శ్రీవల్లిపై 49ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కార్యదర్శిగా పోటీ చేసిన గట్టు ప్రమోద తన సమీప ప్రత్యర్థి కెల్లా నళిని జయంతిపై 34 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికలో కాకి వెంకటపరమేశ్వరి తన ప్రత్యర్థి మచ్చా సుజాతపై 91 ఓట్ల భారీ విజయం సాధించింది. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విప్పర్తి ఇందిర, కళ్యాణపుదేవి, జి.వీరలక్ష్మి, బత్తుల అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు జి.రామ్మోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఎ.సత్తిరాజు అభినందించారు.

29న ఉద్యోగ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 23: రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా స్థాయి మహిళ, పురుష క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 29న కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్‌లతో ఎంపికలు నిర్వహిస్తారు. ఆసక్తి గల ఉద్యోగ క్రీడాకారులు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా కాకినాడ డీఎస్ఏ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామ శివారు మామిడితోటలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. 40 నుంచి 45ఏళ్ల వయసు ఉంటుందని, ఎత్తు 5.8 అడుగులతో చామనఛాయ రంగుతో ఉండి నీలం రంగు జీన్ ప్యాంటు, కాఫీ రంగు షర్టు వేసుకున్నాడన్నారు. గుండు ఉండడంతో సత్యదేవుని దర్శనానికి వచ్చి తలనీలాలు సమర్పించి ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు అన్నవరం ఎస్ఐ 9440796571 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



రెండో రోజు దీక్షా శిబిరంలో శివగణేష్, సూర్యచంద్ర (పైన)



బాధితులతో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు (కుడి)

గుమ్మళ్లదొడ్డిలో ఉద్రిక్తత

- ప్రధాన రహదారిపై బాధితుల బైఠాయింపు
- రెండో రోజుకు నిరవధిక నిరాహార దీక్ష

గోకవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను మూయించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం రోజుకు చేరుకుంది. వారికి మహిళలు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. మా ఆరోగ్యానికి హాని కలిగించే ఈ ఫ్యాక్టరీ మాకొద్దు అని చిన్నారులు ప్లకార్డులు చేతబూనారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ అవసరమా? వేలాది మంది ప్రజల ఆరోగ్యం ముఖ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానికులు, చుట్టుపక్క గ్రామాల ప్రజల అభీష్టం మేరకు పరిశ్రమను ఏర్పాటు చేశారా అని నిర్వాహకుల తీరును ఎండగట్టారు. కాగా పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ భారీ సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వందలాది మంది ప్రధాన రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిశ్రమను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఒకానొక సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల జులుం నశించాలి అంటూ ఆందోళనకారులు నినాదాలతో హోరెత్తించారు. దీక్షా శిబిరాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి అధికారి పి.ప్రదీప్‌కుమార్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికీ ఇవ్వకపోవడంపై అధికారుల తీరును బాధితులు తప్పుబట్టారు.

సెంట్రల్ జైలులో తనయుడితో మాజీ మంత్రి విశ్వరూప్ ములాఖత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23: కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో అరెస్టు అయి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న పినిపే శ్రీకాంత్‌తో అతడి తండ్రి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ములాఖత్ అయ్యారు. బుధవారం ఆయన సెంట్రల్ జైలుకు చేరుకుని ఇంటర్వ్యూ పెట్టుకుని సుమారు 30 నిమిషాల పాటు శ్రీకాంత్‌తో మాట్లాడినట్టు జైలు అధికారులు తెలిపారు. ఆయన జైలు వద్దకు వస్తున్నట్టు ఎవరికీ సమాచారం లేకుండానే వచ్చి వెళ్లారు. స్థానిక వైసీపీ నాయకులకు కూడా సమాచారం లేకపోవడం గమనార్హం.

తపోవనంలో కార్తీక పూజలకు ఏర్పాట్లు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆధ్యాత్మిక పీఠం, పవిత్ర తాండవ నది పరివాహక కాశీ క్షేత్రం తుని శ్రీసచ్చిదానంద తపోవనంలో కార్తీక మాసంలో నిత్య శివ పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు స్వామీజీ శిష్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5న చతుర్థి నాడు శ్రీ గణేష్ సపర్య, నవంబరు 12 మంగళవారం ఏకాదశి నాడు దివ్యనామ సంకీర్తన, 13న బుధవారం ద్వాదశి నాడు శ్రీ రాధా కల్యాణం, 14న గురువారం విశ్వేశ్వర మహాభిషేకం, చతుర్దశి నాడు లక్ష తులసి అర్చన, 15న పూర్ణిమ నాడు శ్రీదేవి కుంకుమార్చన, లక్షపర్తి ప్రదీపోత్సవం, శ్రీరాధా జన్మోత్సవం, జ్వాలాతోరణం, మహారాసోత్సవం, మహాదీపోత్సవం, 28న గురువారం మహా ప్రదోషం, డిసెంబరు 1 ఆదివారం భానువార అమావాస్య, మహాసౌర అరుణ సపర్య, కౌముద్యుత్సవం నిర్వహిస్తారు. కార్తీక సోమవారాల్లో పగలు విశేష ఫలపంచామృత సహిత మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకము, ప్రదోష కాలంలో శ్రీరుద్రక్రమార్చన అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. పరమ పవిత్రమైన కార్తీక మాసంలో తపోవనంలో పూజలు చేసేందుకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 8106983711 నెంబరును సంప్రదించాలని కోరారు.

కారుని వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారుని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారును కాకినాడ జిల్లా తుని మండలం జగన్నాథగిరి వద్ద రోడ్డు పక్కన ఆపారు. అందులో వున్న ఐదుగురు కారు దిగి మూత్ర విసర్జన చేస్తుండగా చెన్నై నుంచి ఒడిశా వెళ్తున్న లారీ వెనుక నుంచి అతి వేగంగా కారును ఢీకొట్టింది. పైలా వెంకట సత్య అప్పలస్వామి (66) అక్కడికక్కడే మృతి చెందగా గోవిందరాజులు, తారక్, కొండలరావు, రమణ తీవ్రంగా గాయపడ్డారు. భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది వచ్చి క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వెంకట సత్య అప్పలస్వామి వెటర్నరీ డాక్టర్ కాగా, గాయపడిన నలుగురూ అతడికి సన్నిహితులు. వీరు విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు తెలిసింది. లారీ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి చెప్పారు.



(మృతుడు) అప్పల స్వామి (పాత చిత్రం)



ప్రమాద స్థలంలో లారీ (పైన) కారుని క్రేన్‌తో తొలగిస్తున్న హైవే సిబ్బంది (కింద)



సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అదృశ్యం



దేవీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సోయం శ్రీసౌమ్య అదృశ్యమైంది. ఈ నెల 21వ తేదీన సచివాలయానికి అని చెప్పి వెళ్లిన శ్రీసౌమ్య ఇంటికి తిరిగి రాలేదని ఆమె తల్లి పార్వతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేశారు. శ్రీసౌమ్య ఎవరికైనా ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీపీఎం సీనియర్ నాయకుడు సత్యనారాయణ హఠాన్మరణం



సత్యనారాయణ (పాత చిత్రం)

వీఆర్ పురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత పూనెం సత్యనారాయణ (54) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బుధవారం తమ పొలంలో పనులను పర్యవేక్షించేందుకు దంపతులిద్దరూ నూతిగూడెం వెళ్లారు. పనులను చూస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అక్కడి నుంచి రేఖపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు కోతులగుట్ట ఆసుపత్రికి రిఫర్ చేయగా వెంటనే అంబులెన్స్‌లో అక్కడికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం రేఖపల్లి సర్పంచ్. సత్యనారాయణ మరణ వార్త తెలుసుకున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణ రెండుసార్లు పెద్దమట్టపల్లి పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ప్రజా సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు, పోరాటాలు చేశారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

అధ్వాన పారిశుధ్యం

- డంపింగ్ యార్డులను తలపిస్తున్న రహదారులు
- పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు కలుషితం?
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సీతానగరం శెట్టిబలిజపేట రోడ్డులో పేరుకు పోయిన చెత్త

సీతానగరం, అక్టోబరు 23: సీతానగరంలో పారిశుధ్యం మళ్లీ అధ్వానంగా మారింది. జూలై నెలలో సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరు గ్రామంలో సుమారు 13 మంది డయేరియా సోకి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన డంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అయినప్పటికీ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు అధ్వానంగా మారాయి. గత సంఘటనలు మరిచిపోయి పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఏ ప్రధాన రహదారి చూసినా డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. స్థానిక స్టేట్‌బ్యాంకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న మంచినీటి పైప్‌లైన్ పగిలి నీరు లీకవుతున్న పట్టించుకునే నాథుడు లేకపోవడంతో నీరు వృథా కావడమే కాకుండా మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

గోకవరం రెవెన్యూ కార్యాలయంలో సీసీ కెమెరాలు



కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

గోకవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోకవరం రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నెల 21న అవినీతి గబ్బిలాలు అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. ఇప్పటికే స్థానిక అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి సీరియస్ కాగా, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ గోకవరం రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యాలయానికి తరచూ ఎవ్వరు వస్తున్నారో, ఎప్పటివరకు ఉంటున్నారో అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఈ కెమెరాలను ఏర్పాటు చేయించినట్టు తెలుస్తోంది. గతంలో ఓ తహశీల్దారుకు అందిన ఫిర్యాదుల మేరకు కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కానీ కొంతకాలానికే ఆ అధికారిణి ఇక్కడి నుంచి బదిలీ చేయించారు. ఆ తరువాత కొన్ని రోజులకే కార్యాలయంలోని సీసీ కెమెరాలు మాయమైపోయాయి. ఇప్పుడు మళ్లీ సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు.

28న పీడీఎస్‌యూ గోల్డెన్‌జూబ్లీ సభ

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్
- జాతీయ సభ పోస్టర్ ఆవిష్కరణ



గోల్డెన్ జూబ్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పి.టాన్య, కిరణ్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 వసంతాల గోల్డెన్ జూబ్లీ సభను రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో ఈ నెల 28న నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్య, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఏర్పాటు చేసే జాతీయ సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సభకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, వక్తలుగా పి.టాన్య, ప్రొఫెసర్ టి.సత్యనారాయణ, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ తదితరులు విచ్చేయనున్నట్టు చెప్పారు. ఈసభను విజయవంతం చేయాలని కిరణ్‌కుమార్ కోరారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- కడియపులంక ఆరోగ్య కేంద్రం తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

కడియం, అక్టోబరు 23: మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. కడియపులంకలో ఇటీవల ప్రారంభమైన తాత్కాలిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి, డిప్యూటీ డెమో సత్యకుమార్, ఎంపీహెచ్ఈవో రాజు, వైద్యాధికారి డాక్టర్ జెస్సీ సుప్రియ, హెల్త్ విజిటర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'క' యూనిట్ సందడి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మాత గోపాలకృష్ణారెడ్డి, హీరో కిరణ్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటించిన క మూవీ చిత్ర యూనిట్ రాజమండ్రిలో సందడి చేసింది. సుజిత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో కిరణ్, తన్విరామ్, నయన్ సారిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ చక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరుతో చింతా గోపాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా దీపావళి కానుకగా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా స్థానిక షెల్టన్ హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నిర్మాత గోపాలకృష్ణారెడ్డి, హీరో కిరణ్ మాట్లాడారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ టీజర్ ఆసక్తికరంగా ఉందన్న టాక్ వచ్చిందన్నారు.సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

రాజానగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందరాడలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఇందుకు సంబంధించి రాజానగరం సీఐ ఎస్.ప్రసన్నకుమార్ వివరాల మేరకు నందరాడలో పుట్టినరోజు సందర్భంగా పేకాట ఆడుతుండగా, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.50 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నామని, వీరంతా రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన వారన్నారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైసీపీ నేతలను సత్కారిస్తున్న దృశ్యం

వైసీపీ నేతలకు సత్కారం

బిక్కవోలు, అక్టోబరు 23: వైసీపీ నేతలను బుధవారం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి నేతలు హామీలు నెరవేర్చి పాలన చేయాలని, వైసీపీ వారిపై దాడులు చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మోల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చున్నీలాల్ జాజూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు మోల్ భావనపై అవగాహన కల్పించారు. మోల్ శాస్త్రవేత్త కనుగొన్న ఒక సంఖ్యపై విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎం.పద్మజ, జి.తేజస్విని, ఎం.శాంతకుమారి, సీహెచ్ రజనీ, జే.శశిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ డీపీఎంఆర్ తప్పనిసరిగా జరగాలి

డీఎల్‌టీవో డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 10, 11 తేదీల్లో లెప్రసీ డీపీఎంఆర్ కార్యక్రమాలు తప్పనిసరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి, డీఎల్‌టీవో డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం సిటీలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, కంబాలపేట, ఆనందనగర్ యూపీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ, లెప్రసీ, హెచ్ఐవీ సంబంధిత ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. పేషెంట్స్ కార్డులపై ఆరా తీశారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడి టీబీ పరీక్షలు, టీబీ కేసులు తక్కువగా నమోదు కావడంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర పేర్కొన్నారు.

అగరబత్తీల తయారీ యూనిట్ సందర్శన

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, వ్యర్థ పూల నుంచి ఆదాయ వనరుగా యూనిట్ ఏర్పాటు దిశగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు తునిలో ఏర్పాటు చేసిన అగర బత్తుల తయారీ యూనిట్‌ను సందర్శించినట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మూర్తి తెలిపారు. కడియం మండలానికి చెందిన 40మంది స్వయం సహాయక మహిళా సభ్యులతో కలిసి అగరబత్తీల తయారీ విధానాన్ని తెలుసుకున్నామన్నారు. కడియం పూల మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న పూలను ప్రతిరోజు పెద్దఎత్తున బయట పడవేస్తున్నారని, వాటి నుంచి ఆదాయం సృష్టించే కార్యక్రమాలను నిర్వహించి సంఘాలకు ఆదాయం కల్పించే ఉద్దేశ్యంతో కలెక్టర్ సూచనల మేరకు ఈ యూనిట్‌ను సందర్శించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అగరబత్తీల తయారీ విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు, ముడిసరుకు సేకరణ తదితర విషయాలను తెలుసుకున్నట్టు మూర్తి చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు యూజీబీ తిలక్, ఎస్.పద్మారావు, కడియం ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలుడి వైద్యానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సాయం చేయించారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్‌కు చెందిన దాసింపల్లి శ్రీను, రమ్య దంపతుల కుమారుడు రెండున్నరేళ్ల కుషల్ మెదడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. 3 నెలలకోసారి రూ.18 వేలు విలువ చేసే బోటెక్స్ ఇంజక్షన్లు పది వేయించాలి. ఎమ్మెల్యే వాసు పిలుపుతో స్థానిక సిటీఆర్ఐ ప్రాంతానికి చెందిన పి.రవితేజా రూ.18 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని బాలుడి తల్లికి ఎమ్మెల్యే వాసు, రవితేజ బుధవారం అందించారు. కార్యక్రమంలో మొకమాటి సత్యనారాయణ, కె.అనంత్ పాల్గొన్నారు.

సినీ హీరో ప్రభాస్ అభిమానుల అన్నదానం



ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా రాజమహేంద్రవరంలో యంగ్ రెబల్ స్టార్ ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సిటీ ప్రెసిడెంట్ దేవీప్రసాద్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. గాంధీపురంలోని వేంకటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాల వద్ద, గౌతమి జీవకారుణ్యం సం ఘంలో జరిగి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అన్న దానం ప్రారంభించారు.దానవాయిపేట జక్కంపూడి బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కప్పల వెలగుకుమారి, కోసూరి చండీప్రియ, బొర్రా చిన్ని,చాపల చిన్న రాజు, మహేష్ కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు 'చల్లా' విరాళం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న జరుగనున్న ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవం నిమిత్తం ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు రూ.25 వేలు విరాళం అందించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ పాలపర్తి ఎబెల్ రాజుబాబుకు అందించారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, కేసులు, వాహన ప్రమాద కేసులు, ప్రీ లిటికేషన్, బీఎస్ఎన్ఎల్, చెక్‌బౌన్స్ కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు.

ఎరువులు విచక్షణారహితంగా వాడొద్దు

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

రాజానగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందులను విచక్షణారహితంగా వాడొద్దని జిల్లా వ్యవసాయఅధికారి ఎస్.మాధవరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని రాజానగరం, వెలుగుబంద గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నత్రజని ఎరువులు అధికంగావాడడం, పొటాష్ ఎరువును తక్కువగా వాడడం వల్ల తెగుళ్ల, పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. పురుగుమందులు పిచికారీ సమయంలో ముక్కు, మూతి భాగాన్ని కప్పి ఉంచేలా మాస్క్ ధరించాలని, చేతికి గ్లౌజులు తొడుగుకోవాలని రైతులకు, వ్యవసాయ కూలీలకూ సూచించారు. తద్వారా చాలావరకూ ఆరోగ్య సమస్యల నుంచి బయటపడతారని చెప్పారు. అలాగే రైతులు కొత్త వరి వంగడాలైన ఎన్ఎల్ఆర్-34449, 2209 వంటి అధిక దిగుబడినిచ్చే వంగడాలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు నరసింహారావు, శ్రీనివాస్, డీఆర్‌సీ జయలక్ష్మి, మండల వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు ఎస్‌కే ఇమామిఖాసిం, దివ్యశ్రీ, కూటమి నాయకులు తోటరామకృష్ణ, లక్ష్మి, జయ, అమ్మాజీ పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకి తోలుకోవచ్చని, ధాన్యం తోలే వాహనానికి జీపీఎస్ తప్పనిసరి అని చెప్పారు. అనంతరం 25శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, రైతులు, ఉద్యానశాఖాధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కమిషనర్ కేతన్‌గార్గ్
- రాజమహేంద్రవరంలో 36 దుకాణాల తనిఖీ
- రూ.1.40 లక్ష అపరాధ రుసుం విధింపు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23: రాజమహేంద్రవరాన్ని పరిశుభ్రంగా వుంచడంలో నగరపాలక సంస్థ నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం కార్పొరేషన్ పరిధిలోని పలు దుకాణాలను శానిటేషన్ అధికారులు తనిఖీలు చేసి అవగాహన కల్పించారు. అలాగే అపరాధ రుసుములు విధించారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్, కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు నగరపాలక సంస్థ అమలు చేయాలని వివరించారు. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని లేకుంటే ఆయా సంస్థలపై అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాలపై రూ.వేయి నుంచి రూ.5 వేలు, రూ.10 వేల వరకు, బహిరంగ ప్రదేశాలు, కాలువల్లో చెత్త వేస్తే రూ.300 నుంచి రూ.3 వేల వరకు, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేస్తే రూ.వేయి నుంచి రూ.5 వేలు అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. అలాగే చెత్తను సెగ్రిగేషన్ చేసి ఇవ్వకుంటే రూ.2 వేలు, తోపుడు బండ్లు, కమర్షియల్ షాపుల్లో చెత్తను ఉంచుటకు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయకుంటే రూ.వేయి నుంచి రూ.3 వేలు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు, మాల్స్ పెట్రోల్ బంకుల్లో టాయిలెట్స్, యూరినల్స్ ఏర్పాటు లేకపోతే రూ.3 వేలు, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే రూ.100, మలమును బహిరంగ ప్రదేశాల్లో పారవేసిన వారికి రూ.3 వేలు, గృహనిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తే రూ.10 వేలు, అనుమతిలేని, కలుషిత వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు చేసిన వారికి రూ .2 వేల నుంచి రూ.10 వేల వరకు, అనుమతి లేకుండా బయట ప్రదేశాల్లో జనసమీకరణాలు చేయుట, సౌకర్యాలు కల్పించకపోవుట చేసిన వారికి రూ.5 వేలు, కర్మాగారం నిబంధనలు పాటించకపోయినా, భద్రత ఏర్పాట్లు లేకపోయినా రూ.50 వేలు, కర్మాగారంలో వాడుక నీరు సక్రమంగా నిర్వహణ లేకపోయినా రూ.50 వేలు, వృక్షాలు అనుమతి లేకుండా నరికి వేసిన రూ.3 నుంచి రూ.5 వేలు, రోడ్లపై ఆవులు, పందులను వదిలివేసే యజమానులకు రూ.2 వేలు, ఫుట్‌పాత్‌లు, రోడ్లపై వ్యాపారం చేయడం, వ్యర్థాలు వదిలేయడం చేసిన వారికి రూ.వేయి, ప్రజారోగ్యానికి భంగకరంగా ప్రవర్తించే వారికి రూ.1 నుంచి రూ.5 వేలు అపరాధ రుసుము వసూలు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఇప్పటి వరకు చేసిన తనిఖీల్లో 36 మంది వ్యక్తుల సంస్థలపై రూ.1,40,000 అపరాధ రుసుము విధించినట్టు కమిషనర్ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల కృషి



రంగంపేటలో విద్యార్థులకు మ్యాప్‌ను వివరిస్తున్న ఎస్ఐ కృష్ణసాయి

దివాన్‌చెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ ఎంతో కృషి చేస్తోందని బొమ్మూరు ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దేశరక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి అమరులైన పోలీసుల సేవలను గుర్తుచేశారు. అలాగే సమాజంలో ప్రస్తుతం సైబర్‌నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో వివరించారు. మొబైల్స్‌కు, సోషల్‌మీడియా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమార్‌ను ప్రిన్సిపాల్ విమల సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేటలో 'ఓపెన్ హౌస్'

రంగంపేట,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ తోట కృష్ణసాయి ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్‌వీఎస్ఎం పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రికార్డులు, వివిధ రకాల ఆయుధాలపై అవగాహన కల్పించారు.

అనపర్తి: అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసుల విధులు, పోలీస్ కమ్యూనికేషన్, వీఐపీ బందోబస్తు విధులపై సత్యభామ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ శ్రీను నాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గ్రాంట్లు విడుదల

బిక్కవోలు, అక్టోబరు 23(ఆంధ్యజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు విడుదలైనట్టు ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండలంలో 30 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటికి రూ.5,87512.500 విడుదలయ్యాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి 1-30కు రూ.10వేలు, 30-100కు రూ.25 వేలు, 101-250 కు రూ.50 వేలు, 251-1000కు రూ.75 వేలు చొప్పున నిధులు వస్తాయన్నారు. అయితే ప్రస్తుతం ఈ నిధుల్లో 50శాతం మేర విడుదలయ్యాయన్నారు. అయితే మూడేళ్లగా పాఠశాలకు నిధులు విడుదల కాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల చేయడంపై ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు

ఆరికరేవులలో రెవెన్యూ గ్రామసభ



బిక్కవోలు, అక్టోబరు 23(ఆంధ్యజ్యోతి): రెవెన్యూ శాఖ నిర్వహించే రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి సూచించారు. బుధవారం ఆమె అధ్యక్షతన గ్రామంలో నిర్వహించిన సభలో 42 మంది రైతులు తమ భూములను రీసర్వే చేయాలంటూ దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఇందల వీరబాబు, రెడ్డి శ్రీనివాసరావు,కొర్ల వినాయకరావు, మహిపాల సోమినాయుడు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి కందిపప్పు నూరు శాతం అందించాలి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి లబ్ధిదారుడుకి నూటికి నూరుశాతం కందిపప్పు అందించాలని కొవ్వూరు ఇన్‌చార్జి ఏఎస్‌వో నాగంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి పంచదార, కందిపప్పు అందించే విధంగా ప్రభుత్వం అందరికీ సరిపడే సరుకులు సరఫరా చేస్తుందన్నారు. ప్రతి డీలర్ విధిగా డీడీలు తీసి సరుకులు చేర్చుకోవాలన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి ఉదయం 6గంటలకే ప్రజా పంపిణీ ప్రారంభించాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం జగన్నాథపురంలో విద్యుత్ షాక్ గురై యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లికి చెందిన కొవ్వూరు దుర్గాప్రసాద్ జగన్నాథపురంలో ఒక ఇంటి నిర్మాణంలో రాడ్ బెండింగ్ పనిచేస్తుండగా రాడ్ విద్యుత్ తీగాలకు తగలడంతో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అహరోన్ ఎంపిక

నిడదవోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని డొక్కా సీతమ్మ ఓరియంటల్ పురపాలక పాఠశాల విద్యార్థి కాకి అహరోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతల బీమారావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు మూతిన వీరలక్ష్మి తెలిపారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో జరిగిన జిల్లా స్థాయి 600, 400 మీటర్ల పరుగు పందెంలో అహరోన్ ప్రథమస్థానంలో నిలిచాడని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు నిలిపివేత
ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ - వార్త 8లో



పంట పండింది!

- మొదలైన ఖరీఫ్ ధాన్యం మాసూళ్లు
- తుఫాను గండం తప్పినట్టే
- వర్షాలు రాకపోతే పండగే
- ఈనెలాఖరుకి కోతలు ముమ్మరం
- 220 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము వేస్తామని చెప్పి 24 గంటల్లోనే జమ
- దళారుల జోలికి వద్దు.. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని వినతి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ వరిపంట కోతలు మొదలయ్యాయి. తుఫాను ముప్పు తప్పి, వర్షాలు రాకపోతే జిల్లాలో ఈ ఏడాది అన్నదాతకు పండగ రోజులనే చెప్పాలి. గత ప్రభుత్వం అనేక తప్పు చేసి రైతులను ముప్పు తిప్పలు పెట్టిన సంగతి తెలిసిందే. ధాన్యం కొనేవారు లేక, ఎవరి ధాన్యం ఏ మిల్లులో కొంటారో అర్థం కాక, డబ్బులు ఎపుడిస్తారో కూడా తెలియని పరిస్థితిలో రైతులు గత రబీ వరకూ తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం బాకీ పడ్డ రబీ రైతుల డబ్బును కూడా ఈ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాక కోతలకు ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. పైగా గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులకు రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుందని చెప్పి, కూడా నెలల తరబడి వేసేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లోనే డబ్బు జమచేస్తామని రైతులకు భరోసా ఇచ్చింది. దానికి అనుగుణంగా ఇప్పటివరకు ముగ్గురు రైతులకు కేవలం 24 గంటల్లోనే డబ్బు జమచేసి ఓ రికార్డు సాధించింది. ఇక జిల్లాలో 72 వేల హెక్టార్లలో వరి పంట వేశారు. దీని నుంచి 5 లక్షల 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. సుమారు 70 వేల టన్నుల వరకూ రైతులు విత్తనాల కోసం, సొంత వినియోగం, స్థానికంగా అమ్ముకోవడానికి వినియోగించగా, మిగతా 4 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుంది. అందులో కస్టమ్ రైస్ మిల్లింగ్ కోసం పౌర సరఫరాల సంస్థ 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది. మిగతా ధాన్యం మిల్లర్లు, ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఇక్కడ రైతులు జాగ్రత్తగా అమ్ముకోవాలి. ప్రస్తుతం తుఫాను గండం తప్పినట్టేనని అధికారులు చెబుతున్నారు. ఇక వర్షాలు రాకపోతే దీపావళి నుంచి కోతలు ముమ్మరం అవుతాయి. నవంబరు చివరికి చాలా వరకూ కోతలు పూర్తవుతాయి. కానీ గోకవరం, కోరుకొండ, సీతానగరం, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల ప్రాంతాల్లో డిసెంబర్ మొదటి వారం వరకూ కోతలు ఉండవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అంచనా వేశారు. వాతావరణంలో ఏవిధమైన ఇబ్బందులు లేకపోతే ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రైతులు మధ్యవర్తులు, ఇతరులకు అమ్మేసుకోకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే మంచిధరతో పాటు డబ్బుకు వెంటనే చేతికి అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నల్లజర్ల, కొవ్వూరు ప్రాంతాల్లోని ముగ్గురు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ధాన్యం సొమ్ములు పూర్తిగా జమచేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ విధానం చరిత్రలోనే చూడలేదని, కేవలం 24 గంటల్లో డబ్బులు జమచేయడం ఒక రికార్డు అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల మండలంలోని ప్రకాశరావుపాలెంనకు చెందిన రైతులకు డబ్బులు జమకావడంతో ఆయన రైతును అభినందించారు.


ధర్మవరం రైతు సేవా కేంద్రంలో జేసీ చిన్నరాముడు

ధాన్యం సొమ్ము 48 గంటల్లో జమ : జేసీ

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమచేయడం జరుగుతుందని, తొలిసారి ఏకంగా 24 గంటల్లోనే సొమ్ము జమచేశామని చెప్పారు. కొవ్వూరు మండలం ధర్మవరం రైతు సేవా కేంద్రంలో 21, 22 తేదీల్లో ఇద్దరు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి వెంటనే ఆ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 48 గంటల్లో ధాన్యం సొమ్ము జమకావడం పట్ల రైతుల హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు. జేసీ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఉన్నారు.


ఉండ్రాజవరంలో పొట్ట దశలో వరిపంట.. గోపాలపురం మండలం చెరుకుమిల్లిలో ట్రాక్టర్‌లోకి ధాన్యాన్ని నింపుతున్న వరికోత యంత్రం

వాతావరణంలో మార్పులు.. దళారుల దందా

రాజమహేంద్రవరం రూరల్/ గోపాలపురం/పెరవలి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వరికోతలు మొదలయ్యాయి. గత వారంరోజులుగా రాజమహేంద్రవరం రూరల్ మండలంలో తొలుత ఊడ్చిన సన్నాలు రకం వరి కోతలు జరుగుతున్నాయి. ఆ సమయంలో బస్తా రూ.1700 చొప్పున కొనుగోలు చేశారు. తర్వాత వాతావరణంలో మార్పులు రావడంతో దళారులు, మిల్లర్ల ఏజెంట్లు రంగంలోకి దిగారు. రూ.1700కు కొన్న ధాన్యాన్ని రూ.1400కి తగ్గించేశారు. ఈ ప్రాంతంలో సన్నాలు రకాలు ఎకరానికి 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తోందని కోతలు కోసిన రైతులు చెబుతున్నారు. రూరల్ మండలం పరిధిలో తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గోపాలపురం మండలంలో కూడా ధాన్యం కొనుగోలులో దళారుల జోక్యం పెరిగిపోయింది. వాతావరణం మార్పులను అవకాశంగా తీసుకుని అయినకాడికి కొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఆరబెట్టిన ధాన్యం వంద కిలోల కామన్ రకం ధర రూ.2300కాగా, 75 కిలోలు రూ.1725 గిట్టుబాటు ధర ప్రకటించింది. అయితే పంటను కోసి అరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలంటే ఇప్పుడు సాధ్యమయ్యేలా లేదు. తుపాన్ల భయంతో ఏదోలా విక్రయించాలని రైతులు చూస్తున్నారు. పెరవలి మండలంలో ముదురుగా ఊడ్చిన వరిచేలు ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. అయితే మారిన వాతావరణ పరిస్థితుల వల్ల వీటిని ఆరబెట్టుకోవడానికి అవకాశం లేకపోవడంతో పచ్చిధాన్యంగానే విక్రయిస్తున్నారు. కోతలు మొదలైన తొలుత ఇక్కడ రూ.1340దాకా బస్తా రేటు పలికింది. అనంతరం రూ.1250కి దిగజారింది. ప్రస్తుతం మళ్లీ రేటు పెరిగి రూ.1420 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ మండలంలో ఎక్కువగా పీఎల్ రకం సాగు చేయడంతో ఈనెలాఖరు నాటికిగాని అవి కోతకు రావు. అప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు కూడా పనిలేకుండా పోయింది. రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ఎవరూ విక్రయించవద్దని పెరవలి వ్యవసాయాధికారి మేరీ కిరణ్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆరబెట్టుకొని అమ్ముకునే వాతావరణ పరిస్థితులు లేవని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



తక్కువ ధరకే ధాన్యం విక్రయించా..

నేను నాలుగు ఎకరాల్లో వరి వేశాను. త్వరగా కోతకు వచ్చే రకం కావడంతో 15 రోజుల కిందటే కోత కోశాను. అయితే ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేకపోవడంతో పచ్చి ధాన్యం విక్రయించాను. బస్తా రూ.1250కు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుతం రేటు పెరిగింది. కానీ సుమారు రూ.170 వరకు ఒక్కొక్క బస్తా మీద నష్టపోయాను.

- నందమూరి రామారావు, రైతు, తీపర్రు

చివర్లో ఎండాకు తెగులు దెబ్బ

ఉండ్రాజవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉండ్రాజవరం మండలంలో సార్వా వరిపంటపై ఎండాకు తెగులు సోకింది. దీంతో రైతులు తెగులు నివారణ చర్యలు చేపట్టారు. మండలంలో 11వేల ఎకరాల్లో సార్వా పంట వేశారు. ఎండాగు తెగులు వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలో స్వర్ణ, పీఆర్ 126 వరి రకాలను రైతులు వేశారు. ప్రస్తుతం ఎక్కువ శాతం పొట్టదశలో ఉన్నాయి. ముందుగా వేసిన వరి పంట నవంబరు రెండోవారం నాటికి కోతకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తరచూ వస్తున్న వర్షాలు, తుపాను వంటి పరిస్థితుల పట్ల రైతులు ప్రస్తుతం బెంబేలెత్తిపోతున్నారు.

అయోమయం..
గందరగోళం




AP SAND MANAGEMENT SYSTEM
SAND RECEIPT
22-10-2024 12:01:50 PM, Delivery date : 22-10-2024
20 (MT)
10-Tyre Truck
Aurangabad Km 5.808, East Godavari District
437314
Total Taxable Value
CGST@2.5%
SGST@2.5%
Total Paid Amount

కొవ్వూరు ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో తవ్వకాలు.. సీనరేజీ, జీఎస్టీతో కలిపిన ఇసుక రవాణా బిల్లు

- సీనరేజీ, జీఎస్టీ రద్దుపై నిర్ణయం అమలులోకి ఎప్పుడో..
- కొనసాగుతున్న ఇసుక దందాలు
- ఆన్‌లైన్‌లో ఇప్పటికీ నోస్టాక్ బోర్డు
- గోదారి గట్టున మాత్రం గుట్టలుగుట్టలు
- కన్నెత్తి చూడని అధికార గణం
- ఇప్పటికైనా మార్పు ఉంటుందా

కొవ్వూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక ఇంకా గందరగోళంలోనే ఉంది. ఎక్కడ ఏం జరుగుతుందో తెలియకుండా అంతా అయోమయంగా కనిపిస్తోంది. అక్కడ రోజూ సీఎం చంద్రబాబు చెబుతున్నారు.. ఇక్కడ జనం వింటున్నారు అంతే. ర్యాంపుల్లో మాత్రం జరిగేది జరిగిపోతోంది. ఇప్పటికీ ఇసుక ధరలో మార్పు లేదు. దందాలో మార్పులేదు. ఇసుక కావాలంటే మామూలు ఇస్తేగాని ఇసుక అందని పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక అక్రమార్కులు ఇష్టానుసారం ఇసుక విక్రయాలు చేస్తున్నారు. ఎప్పుడు ఇసుక ర్యాంపులు విడుదల చేస్తారోనని భవన నిర్మాణ కార్మికులు ఎదురుచూశారు. సీఎం చంద్రబాబు ఇసుక ఉచితం అన్న వెంటనే అందరిలో ఆనందం కనిపించింది. తీరా ఇసుక సరఫరా చేసే సమయం వచ్చేసరికి ధరల్లో పెద్ద తేడా లేదు. ట్రాన్స్‌పోర్టు ఖర్చు, సీనరేజీ అని, జీఎస్టీ, మామూళ్లు అంటూ 20 టన్నుల ఇసుకకు రూ.20 వేలు లాగేస్తున్నారు. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో 16 ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. 119 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. 9 డిసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. ప్రస్తుతం డిసిల్టేషన్ ర్యాంపుల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక సరఫరా జరుగుతోంది. సర్కారు విధానం ప్రకారం ఆయా ర్యాంపుల నుంచి కొనుగోలుదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఇసుక పొందవచ్చు. కానీ ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినా నోస్టాక్ బోర్డులే కనిపిస్తున్నాయి. దీంతో ఇసుక వినియోగదారుడు ఏ ర్యాంపులో ఇసుక ఉందని తెలిస్తే ఆ ర్యాంపులో ఇసుక బుక్ చేసుకుంటున్నాడు. రాజమహేంద్రవరం వినియోగదారుడు ఇసుక బుక్ చేసుకోవాలంటే ఔరంగాబాద్, వాడపల్లి ర్యాంపుల్లో ఇసుక ఉన్నట్టు చూపిస్తోంది. రాజమహేంద్రవరం ర్యాంపుల్లో నోస్టాక్ బోర్డులే కనిపిస్తున్నాయి. దీంతో వినియోగదారునిపై ట్రాన్స్‌పోర్టు చార్జీల రూపేణా అదనపు భారంపడుతోంది. ఈ నేపథ్యంలో 20 టన్నుల ఇసుక లారీ అన్ని ఖర్చులు కలుపుకుని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలకడం గమనార్హం. ఇది కాకుండా మామూళ్లు అదనం. దీనిపై కొనుగోలుదారుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాడు.

సీనరేజీ, జీఎస్టీ రద్దు...

సీనరేజీ, జీఎస్టీ రద్దు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటన చేశారు. కేబినెట్ కూడా ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటికీ కూడా ఇసుకపై సీనరేజీ, జీఎస్టీ వసూలు చేస్తూనే ఉన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే ఇంకా తమకు ఎటువంటి ఆదేశాలూ రాలేదని చెబుతున్నారు. దీంతో 20 టన్నుల లారీ వినియోగదారునిపై జీఎస్టీ రూ.672, సీనరేజీ రూ.1760 చెల్లించాల్సి వస్తోంది.

గుట్టలు గుట్టలుగా ఇసుక

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, సీతానగరం, కడియం, నిడదవోలు, పెరవలిలలో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. జిల్లా చుట్టూ 10 కిలోమీటర్ల దూరంలోనే ఇసుక బుక్ చేసుకునే విధంగా అందుబాటులో ర్యాంపులు ఉన్నాయి. దాంతోపాటు ఎక్కడికక్కడ గుట్టలు గుట్టలుగా ఇసుక కూడా ఉంది. ఆన్‌లైన్‌లో మాత్రం దూర ప్రాంతాల్లో ఉన్న ర్యాంపులు దర్శనమిస్తున్నాయి. దీంతో రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. మంగళవారం దివాన్‌చెరువుకు చెందిన వినియోగదారుడు ఇసుక బుక్ చేసుకుంటే కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్ ర్యాంపు చూపించింది. దివాన్ చెరువు నుంచి ఔరంగాబాద్‌కు సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రవాణా చార్జీల కింద రూ.6876లు వసూలు చేశారు. అదేపక్కనే ఉన్న రాజమహేంద్రవరం ర్యాంపుల్లో ఇసుక కేటయించి ఉంటే రవాణా చార్జీలు సగానికి తగ్గేవి. దూర ప్రాంతాల్లోని ర్యాంపులను కేటయించడం వల్ల ట్రాన్స్‌పోర్టర్‌కు లాభం చేకూర్చినా, వినియోగదారుడు మాత్రం నలిగిపోతున్నాడు.

ఇసుక కావాలంటే అదనం

ఇసుకకు బిల్లు మొత్తం చెల్లించామన్నా మాకేంటి సంబంధం.. మీరు మాకు మామూళ్లు కట్టాల్సిందేనని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ర్యాంపులకు అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో అక్రమార్కుల దందా శృతిమించుతోంది. లారీ ర్యాంపు దాటి బయటకు రావాలంటే రూ.1000 చెల్లించాల్సిందే. ఆ మొత్తం చెల్లించకపోతే లారీ కూడా లోడ్ చేయడం లేదు. దూరప్రాంతాలకు సరఫరా చేయాలంటే అదనంగా మామూళ్లు ఇవ్వవలిసిందేనని పట్టుబడుతున్నారు. ఇసుక అత్యవసరమైన వినియోగదారులు తప్పనిసరి పరిస్థితిలో వెయ్యి నుంచి రూ.2 వేలు అదనంగా చెల్లించి ఇసుకను తీసుకువెళ్తున్నారు.

అధికారగణం ఎక్కడ..

ఇంత జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అసలు ర్యాంపుల్లో ఏం జరుగుతుందో పర్యవేక్షించే అధికారి కనిపించడం లేదు. ఇదే అదనుగా చూసుకుని అక్రమార్కులు బిల్లులు లేకుండా ఇసుక తరలించిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై ఓ అధికారికి సమాచారం అందించగా రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదుచేయాలని సూచించినట్టు సమాచారం. గతంలో ఇసుక ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా జరిగితే ఎస్ఈబీతోపాటు విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ర్యాంపుల్లో లారీలో ఎంత ఇసుక లోడ్ అవుతోంది, బిల్లు ఉందా లేదా, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా అని పర్యవేక్షించడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు అందినకాడికి దోచుకుంటున్నారు. ర్యాంపుల్లో బహిరంగంగా లావాదేవీలు జరుగుతున్నా అధికారులు, కూటమి నేతలు పట్టించుకోవడం లేదు.

ఇవిగో ఉదాహరణలు

రాజమహేంద్రవరం దివాన్‌చెరువుకు చెందిన లక్ష్మణ్ సందీప్ ఇంటి నిర్మాణం కోసం ఈనెల 22వ తేదీన 20 టన్నుల ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. దీనికిగాను ఇసుకకు సంబంధించి రూ.6571, రవాణాకు సంబంధించి రూ.6876, జీఎస్టీ చార్జీలు రూ.672 కలిపి రూ.14,120 ఆన్‌లైన్‌లో చెల్లించారు. అయితే బుధవారం లారీ డ్రైవర్ ఫోన్‌చేసి కొవ్వూరు పట్టణంలోని ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో ఇసుక లోడ్‌కు వచ్చాను. లోడ్ చేయడానికి ఇసుక గుట్ట యజమాని అదనంగా రూ.1000 అడుగుతున్నాడు. గామన్ బ్రిడ్జి పై నుంచి రావాలంటే టోల్‌ఫీజు అదనంగా చెల్లించాలని వినియోగదారునికి ఫోన్ చేశాడు. దీంతో గుట్ట యజమానికి రూ.1000 చెల్లించి ఇసుక లోడ్ చేసుకుని వెళ్లారు. అలాగే తాళ్లపూడి మండలానికి చెందిన సిద్దూ అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇసుక కోసం గత పది రోజులుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసేందుకు ప్రయత్నిస్తే నోస్టాక్ అని వచ్చింది. రెండుసార్లు ఓటీపీ చెప్పినా బుక్ అవ్వలేదు. చివరికి ఇసుక ర్యాంపులో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని ఆశ్రయించగా ఆన్‌లైన్‌లో బుక్ చేసి ఇసుక పంపించాడు.


జిల్లా స్థాయి అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

నిబద్ధతతో సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

పీజీఆర్ఎస్ అర్జీలపై కలెక్టర్ సమీక్ష.. పీపుల్స్ తహశీల్దార్‌గా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, అక్టోబరు 23: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం ద్వారా ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటి పరిష్కారం ఎంతవరకు అయ్యిందనే అంశంపై కలెక్టర్ ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి దృశ్యమాధ్యమ సమావేశ మందిరంలో ఈ కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా సమస్య పరిష్కారం ఆర్డీవో, తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఎంతవరకు స్పందించారో అన్నదానిపై ఆధారపడి ఉంటుందన్నారు. అర్జీదారునికి అందుబాటులో ఉండడంతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేవిధానంబట్టే పరిష్కారం ఉంటుందన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు కలెక్టర్‌కి రావడంపై కలెక్టర్ ప్రశ్నించారు. ఇకపై టూర్ డైరీ సమర్పించే క్రమంలో క్షేత్రస్థాయిలో ఎన్ని పీజీఆర్ఎస్ అర్జీల పరిశీలన చేశారో నివేదికలో పొందుపరచాలన్నారు. ఇక నుంచి రెవెన్యూ అధికారుల సమావేశాలు డివిజన్ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల పరిష్కారానికి నిబద్ధత కలిగిన పరిష్కార తీరు ఉండాలన్నారు. రికార్డు ఆఫ్ రైట్‌కు అనుగుణంగా ఒక రెవెన్యూ అధికారి ఒక అర్జీని తిరస్కారం చేసిన తర్వాత తిరిగి అదే అర్జీలొస్తే పునఃపరిశీలన పరిధిలో ఉందో లేదో నిర్ధారణ చేయాలన్నారు. కొంత సమయం వెచ్చించి వారిని సంతృప్తి చెందేలా మాట్లాడి వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో చర్యలు తీసుకోవలసిన వాటికి అక్కడే స్పందన ఉంటే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు వారిని పిలిపించుకుని ఓపికగా వివరాలు తెలుసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. సమస్య తెలుసుకునే ప్రయత్నం మనం చేయగలిగితే తగిన న్యాయం చేకూరుతుందన్నారు. దిగువ స్థాయిలో పనిచేసే వారికి వారి పరిధి మేరకు పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టంచేయాలన్నారు. పీపుల్స్ తహశీల్దారులుగా రెవెన్యూ అధికారి పనితీరు ఉండాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు 1158 అర్జీలు రాగా వాటిలో 825 కలెక్టరేట్‌కు, 152 మండల స్థాయికి, ముఖ్యమంత్రి కార్యాలయానికి 23, ఉపముఖ్యమంత్రి ద్వారా 6, ఇతరుల దగ్గరకు 152 వచ్చాయన్నారు. రెవెన్యూశాఖపరంగా 42 అంశాలకు సంబంధించి అర్జీలు పరిష్కారం కోసం వచ్చాయని వాటిలో 10 అంశాలకు సంబంధించినవి 999 ఉండగా, మిగిలిన 32 అంశాలకు సంబంధించినవి 159 మాత్రమే ఉన్నాయని తెలిపారు. నాణ్యతతో కూడిన అర్జీలను పరిష్కారం చేయకపోవడం వల్లనే అర్జీలు రీ ఓపెన్ అవుతున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ సంబంధ ప్రజాఫిర్యాదుల అంశాలపై చర్చించి వాటికి నిర్ణయాత్మకమైన పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏవో ఆలీ మహ్మద్, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కార్తీకం వస్తేగానీ.. రేవులను పట్టించుకోరా..

అపరిశుభ్రంగా ఘాట్లు.. డస్ట్ బిన్లు నిల్.. నిరుపయోగంగా రుడా లాకర్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరానికి సాంస్కృతిక రాజధానిగా, ఆధ్యాత్మిక ధామంగా ప్రాశస్త్యం ఉంది. ఈ కీర్తిలో గోదావరి రేవులు కీలక భూమిక పోషిస్తున్నాయి. రోజూ వందలాది మంది యాత్రికులు నగరానికి వస్తూ గోదావరి నదిలో స్నానమాచరించి ఆలయాలను దర్శించుకుంటారు. అయ్యప్ప, భవానీ దీక్షల సమయంలో ఘాట్లు కళకళలాడుతుంటాయి. మరోవైపు నదుల పరిశుభ్రతకు ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే నగరపాలక సంస్థ మాత్రం అందుకు భిన్నంగా రేవులను అపారిశుధ్యంగా వదిలేస్తోంది. రేవులను పరిశుభ్రంగా ఉంచడానికి కార్తీక మాసం రాక గురించి ఎదురు చూస్తుండడంపై నగరవాసులు విస్మయం వ్యక్తం చేస్తుండగా.. రేవుల్లో కనీసం డస్ట్ బిన్లు కూడా లేని పరిస్థితిని చూసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ స్ఫూర్తి ఎక్కడంటూ యాత్రికులు ప్రశ్నిస్తున్నారు. గత పుష్కరాలకు గోదావరి రేవులను టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. దీనికోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. మెట్లు నిర్మించి యాంటీ స్కిడ్ (జారకుండా) టైల్సు వేశారు. దేశంలోనే నిడివి కలిగిన వాటిలో మొదటి స్థానంలో కోటిలింగాల ఘాట్ నిలుస్తోంది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఘాట్ల నిర్వహణను వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అదే పరిస్థితి నడుస్తోంది. అటు కోటిలింగాల ఘాట్ మొదలుకొని ఇటు వీఐపీ ఘాట్ వరకూ ఎక్కడా సరిగా నిర్వహణ లేదు. కార్తీక మాసం వచ్చిన సమయంలో తప్ప పట్టించుకోవడం లేదు. గోదావరి స్నానానికి జనం ఎక్కువగా వచ్చే పుష్కరఘాట్‌లో అసలు డస్ట్‌బిన్లు లేవు. ఎక్కడి చెత్తను అక్కడే వేసేస్తున్నారు. రేవులో ఉన్న డస్ట్ బిన్లు మూలకు చేరాయి. ఒక్క స్పూను బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. గోదావరి నీళ్లలోని మెట్లు నాచుపట్టి జారుతుండడంతో యాత్రికులకు గాయాలు అవుతున్నాయి. గోదావరి నదిలో పూజాపత్రి, ప్లాస్టిక్ కవర్లు, దుస్తులు వేయడం, షాంపూలు, సబ్బులు వాడడం నిషేధం. గతంలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా మైకులో చెబుతూ ఉండేవాళ్లు. కానీ అవన్నీ ఆపేశారు. గోదావరి నిత్యహారతిని కూడా నిత్యం మమ అనిపిస్తున్నారు. ఇక్కడి సులభ్ కాంప్లెక్స్‌లో రూ.10 వసూలు చేస్తున్నారు. కోటిలింగాల, గణపతి, దుర్గా ఘాట్‌లలోనూ పరిస్థితి భిన్నంగా ఏమీలేదు. పుష్కరాల రేవులో యాత్రికుల కోసం రుడా 30 లాకర్లను ఏర్పాటు చేసింది. ఇవి ఎందుకు ఏర్పాటు చేశారో కూడా చెప్పే నాథుడు కరువయ్యాడు. గోదావరి గట్టున శ్రీస్వామి అయ్యప్ప దేవాలయం పక్కనే రేవు ఉంది. ఇక్కడ నదీ జల కాలుష్య నివారణ పథకం కింద భవనం నిర్మించారు. పైఅంతస్తులో మరుగుదొడ్లు, కింద స్త్రీలు దుస్తులు మార్చుకొనే గదులు ఏర్పాటుచేసి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

దేవరపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామరెవెన్యూ సదస్సులతో రైతులకు ఎంతోమేలు జరుగుతుందని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ రైతులు రీ సర్వేకు సంబంధించి 80 దరఖాస్తులు వచ్చా యని వాటిని వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అధాలత్.

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు ఇంచార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, కేసులు, వాహన ప్రమాద కేసులు, ప్రీ లిటికేషన్, బీఎస్ఎన్ఎల్, చెక్‌బౌన్స్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకుని సమయాన్ని, డబ్బుని ఆదాచేసుకోవాలని సూచించారు.

అధ్వాన రహదారి

• పాడైన యాదవోలు-జగన్నాధపురం రోడ్డు
• ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు • గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు ఆఫీసు వద్ద నిరసన


యాదవోలులో ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు జరుపుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే సంస్థ ప్రతినిధులు

దేవరపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా యాదవోలు నుంచి జగన్నాధపురం వెళ్లే రోడ్డు భారీ వాహనాలతో అధ్వానంగా తయారైంది. దీంతో పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని యాదవోలు గ్రామానికి చెందిన రైతులు బుధవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయం వద్ద టెంటు ఏర్పాటుచేసి నిరసన తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రా క్టరుకు సంబంధించిన ప్రతినిధులు రైతులతో చర్చలు జరిపారు. యాదవోలు నుంచి జగన్నాధపురం 7కిలో మీటర్ల పొడవునా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయాలని ఈ జాతీయ రహదారి పూర్తయ్యే వరకు దాని మేయిటినెన్స్ కూడా మీ సంస్థే చూడాలని రైతులు తెలపడంతో దానికి కాంట్రాక్టరు అంగీకరించారు. ఈ సంఘటనా ప్రాంతానికి దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవోలు రైతులు బళ్ళే నాగేశ్వరరావు, అనిశెట్టి శ్రీనివాస్, చిన్నంశెట్టి ఏడుకొండలు, కసాని శ్రీను, పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం

• పరిమి గంగాధరరావు, చిన్నాయిగూడెం, రైతు



యాదవోలు నుంచి జగన్నాధపురం వెళ్లే రోడ్డు హైవేకి మట్టి తరలించే లారీలు వెళ్లడం వలన పెద్దపెద్ద గోతులుపడి మాకు మోటార్‌సైకిళ్లు వెళ్లే పరిస్థితి లేక తమ పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో ఎన్నిసార్లు చెప్పిన రోడ్డుకు గ్రావెల్ వేయలేదని ఈరోజు రైతులంతా ఆందోళన చేయడంతో వాళ్లు రోడ్డువేయడానికి ఒప్పుకున్నారు.

రోడ్డు వేయడానికి ఒప్పుకున్నారు

• ఎస్. శ్రీనివాస్, రైతు, యాదవోలు.



యాదవోలు నుంచి జగన్నాధపురం వెళ్లే రహదారిలో వేలాది మంది రైతులు ఉన్నారని ప్రతీరోజు పొలాలకు వెళ్లాల్సిన రైతులకు ఈమార్గం తప్ప వేరే మార్గంలేదని ఈ భారీ వాహనాల వల న ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని గ్రీన్‌ఫీల్డ్‌హైవే ప్రతినిధులతో చర్చలు జరపటంతో రోడ్డువేయడానికి వారు ఒప్పుకున్నారని దీంతో ఆందోళన విరమించామని అన్నారు.

రైతుల సేవలో డీసీఎంఎస్

డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వి.యస్.కృష్ణమూర్తి


సమిశ్రగూడెంలో డీసీఎంఎస్ డిపోలో దీపావళి విక్రయాలను ప్రారంభించిన డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి

నిడదవోలు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 21 బ్రాంచిల ద్వారా డీసీఎంఎస్ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయాలు సాగిస్తుందని 2023-24 ఆర్థిక సంవత్సరానికి 104కోట్ల రూపాయల వ్యాపారం చేసిందని డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వీఎస్ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వి.యస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏలూరు నిడదవోలులో డీసీఎంఎస్ విత్తనశుద్ధి కర్మాగారాలు నిర్వహిస్తుందని అన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల విక్రయాలతో డీసీఎంఎస్ రైతు నమ్మకానికి భరోసాగా నిలిచిందన్నారు. జిల్లాలో కొయ్యలగూడెం ఒకటి, జంగారెడ్డిగూడెం రెండు, దేవరపల్లి ఒకటి, గోపాలపురంలో ఒకచోట పుగాకు రైతులకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా పుగాకు ఎరువులను అందిస్తుందన్నారు.

బాణాసంచా విక్రయాలు ప్రారంభం

సమిశ్రగూడెం డీసీఎంఎస్ ద్వారా పదిహేను సంవత్సరాలుగా రైతాంగానికి అతి తక్కువ ధరలకు నాణ్యమైన దీపావళి బాణాసంచాను అందిస్తున్నామని డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వి.ఎస్.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో విత్తనశుద్ధి కర్మాగారంలో డీసీఎంఎస్ దీపావళి బాణాసంచా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వి.యస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ నిడదవోలు పరిసర ప్రాంత రైతాంగానికి నాణ్యమైన దీపావళి బాణాసంచాను అందించడంలో డీసీఎంఎస్ ముందంజలో ఉందన్నారు. రైతులంతా సంతోషంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే నాణ్యమైన బాణాసంచా తక్కువ ధరలకే విక్రయాలు సాగిస్తున్నామన్నారు. మొదటి కొనుగోలుదారుడు బలగం అప్పారా వుకు బాణాసంచా అందించారు. నిడదవోలు డీసీఎంఎస్ మేనేజర్ పి.శ్రీనివాసరాజు, గంగుమళ్ల హనుమంతరావు, బొజ్జా పాపారావు ఉన్నారు.

రేషన్ సకాలంలో అందించాలి

• ఏఎస్‌వో రామాంజనేయులు


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

దేవరపల్లి, అక్టోబరు 23: రేషన్ డీలర్లు ఎండీయూ ఆపరేటర్స్ ప్రజాపంపిణీ సకాలంలో అందించాలని ఏఎస్‌వో రామాంజ నేయులు అన్నారు. దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వచ్చేనెల నుంచి రేషన్ బియ్యంతో పాటు కందిపప్పు, పంచధార అందిస్తామని నూరుశాతం అందరికీ అందేలా చూడాలని రామాంజనేయులు అన్నారు. సివిల్ సప్లై డీటీ ఏ.సత్యనారాయణరావు మాట్లాడు తూ రేషన్‌డీలర్లు ఎండీయూ ఆపరేటర్లు ఉదయం 6గంటల కల్లా సరుకులు అందించాలని అన్నారు. కందిపప్పు రేషన్‌కు ఎంతమంది రేషన్‌కార్డు ఓనర్లు ఉంటే అంతమందికి డీడీ తీయాలన్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోటారుసైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామానికి చెందిన గురు దుర్గారావు అత్త కోనే సత్యవతిని తీసుకుని మోటారుసైకిల్‌పై బుధవారం రాజమహేంద్రవరం ఆసుపత్రికి బయలుదేరాడు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని ఐవోసీ పెట్రోల్‌బంకు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి రిఫర్ చేశారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు నిలిపివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడదవోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో బుధవారం ఇసుకకు క్యూ ఉచితమంటే దర్జాగా దోపిడీ అంటూ నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి కొందరు ఇసుకాసురులు ఉచిత ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ భారీగా విక్రయాలు సాగిస్తున్న దానిపై అధికార్లు స్పందించి ట్రాక్టర్ల ద్వారా ఉచిత ఇసుక రవాణాను నిలిపి వేసారు. బుధవారం సమిశ్రగూడెం ఎస్ఐ కె.వీరబాబు, మైనింగ్ అండ్ జియాలజీ టెక్నికల్ అసిస్టెంట్ పి.శైలజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర పెండ్యాల ర్యాంపు సందర్శించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఉచిత ఇసుక తరలింపు నిలిపివేశామని ఆఫ్‌లైన్ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ఇసుకను బుక్ చేసుకున్న ట్రాక్టర్లను లారీలను అనుమతిస్తామని వారు తెలిపారు. అయితే పెండ్యాల గ్రామంలో కళ్ళెదుటే ఇసుక గుట్టలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నా అధికార్లు ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడం ఇసుక గుట్టలు సీజ్ చేయకపోవడం ఇసుకాసు రులపై చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


పెండ్యాలలో ఉచిత ఇసుక ట్రాక్టర్లను నిలిపివేసిన రెవెన్యూ పోలీస్ అధికార్లు

ఆపదలో ఆదుకోవడంలో జనసేన ముందుంటుంది

దేవరపల్లి, అక్టోబరు 23:దేవరపల్లి గ్రామానికి చెందిన జీ.అంకిత ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకోవడంతో ఆమెకు దేవరపల్లి మండల జనసేన ఆధ్వర్యంలో 17500రూపాయలు నగదు గోపాలపురం నియో జకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అందజేశారు. ప్రభాస్ అభిమానులు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా అంకితకు వైద్యఖర్చుల నిమత్తం రూ.5వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఆపదలో ఆదుకోవడంలో జనసేనపార్టీ ముందుంటుందని ప్రభాస్ అభిమానులు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. జనసేన నాయకులు చప్పటి శివనాగప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, దాసరి శేషు, దుగ్గిన లీలాకృష్ణ గంగాధర్ నాయుడు, సిద్దా తాతబ్బాయి, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.


అంకితకు ఆర్థిక సాయం అందజేస్తున్న గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు


రెండో రోజు దీక్షా శిబిరంలో శివగణేష్, సూర్యచంద్ర (పైన)


బాధితులతో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు (కుడి)

గుమ్మళ్లదొడ్డిలో ఉద్రిక్తత

» ప్రధాన రహదారిపై బాధితుల బైఠాయింపు » రెండో రోజుకు నిరవధిక నిరాహార దీక్ష

గోకవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ల దొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను మూయించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం రోజుకు చేరుకుంది. వారికి మహిళలు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. మా ఆరోగ్యానికి హని కలిగించే ఈ ఫ్యాక్టరీ మాకొద్దు అని చిన్నారులు ప్లకార్డులు చేతబూనారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ అవసరమా? వేలాది మంది ప్రజల ఆరోగ్యం ముఖ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానికులు, చుట్టు పక్క గ్రామాలై అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజల అభీష్టం మేరకు పరిశ్రమను ఏర్పాటు చేశారా అని నిర్వాహకుల తీరును ఎండగట్టారు. కాగా పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ భారీ సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వందలాది మంది ప్రధాన రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిశ్ర మను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఒకానొక సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల జులం నశించాలి అంటూ ఆందోళనకారులు నినాదాలతో హోరెత్తించారు. దీక్షా శిబిరాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి అధికారి పి.ప్రదీప్‌కుమార్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలు సుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికీ ఇవ్వకపోవడంపై అధికారుల తీరును బాధితులు తప్పుబట్టారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

దేవర పల్లి, అక్టోబరు 23: మండలంలోని దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రగతి శీల కార్మిక సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే.మస్తాన్ మాట్లాడుతూ సాయిబాబా అమలాపురం దగ్గర ఓ కుగ్రామంలో జన్మించారని, ఉన్నతవిద్య కోసం హైదరాబాదు వెళ్లి విద్యార్థి దశ నుంచే అనేక ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు. ఆల్‌ఇండియా పిపుల్స్ రెసిడెన్స్ ఫోరం జాతీయ కార్యదర్శిగా కూడా పని చేశారన్నారు. ఆయన ఆదివాసీల పక్షాన, దళిత పీడివర్గాల కోసం పోరాడారన్నారు. ఆయన మృతి వివిధ కార్మిక సంఘాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో మెరిపో జాన్‌రాజు, అచంట వరప్రసాద్, ఏడుకొండలు,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభ్యాస పాఠశాలలో ఒపెన్ హౌస్

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం కొవ్వూరు అభ్యాస పాఠశాలలో పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో ఒపెన్ హౌస్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే ఆయుధాల పనితీరును వివరించారు. పోలీసు అధికారాల విధివిధానాలు, రికార్డుల నిర్వహణ, కమ్యూనికేషన్ సెట్ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నీలిమ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

» డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు » కడియపులంక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కడియం, అక్టోబరు 23: మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. కడియపులంకలో ఇటీవల ప్రారంభమైన తాత్కాలిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.రాజకుమారి, డిప్యూటీ డెమో సత్యకుమార్, ఎంపీహెచ్ఈవో రాజు, వైద్యాధికారి డాక్టర్ జెస్సీ సుప్రియ, హెల్త్ విజిటర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

గోపాలపురంలో పారిశుధ్య పనులు

గోపాలపురం, అక్టోబరు 23: ఆ నీళ్ళు తాగితే రావా రోగాలు అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం పరుగులు పెట్టింది. బుధవారం ఉదయం 7గంటలకే డ్రైనేజీలో ఉన్న బోరు చేతిపంపు పబ్లిక్ కుళాయి ప్రదేశాల్లో పంచాయతీ సిబ్బంది ఆగమేఘాల మీద పారిశుధ్య పనులు చేపట్టారు. పిచ్చిమొక్కలతో ఉన్న ఆ ప్రదేశాలను శుభ్రం చేసి అధికారులు దగ్గరుండి మరీ బ్లీచింగ్ చల్లించారు. దీంతో పాటు ఆరోగ్య సిబ్బంది ఆ ప్రదేశాలను పరిశీలించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

ఉండ్రాజవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి, వడ్లూరు, చివటం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఎంపీడీవో వీఎస్ రామారావు పరిశీలించారు. కేంద్రాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఆదార్ కేంద్రాలను వినియోగించుకోవాలని వీటి ద్వారా కొత్తగా ఆధార్ నమోదు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని, ఆయన సూచించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతికి సంతాపం

ఉండ్రాజవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కూనపరెడ్డి వీరరాఘవేంద్రరావు కుమారుడు లక్ష్మయ్యనాయుడు మృతికి సంతాపం వ్యక్తం చేసారు. బుధవారం లక్ష్మయ్యనాయుడు మృతికి మౌనం వహించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, కాపు సంఘనాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి కందిపప్పు నూరుశాతం అందించాలి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి లబ్ధిదారుడకి నూటికి నూరుశాతం కందిపప్పు అందించాలని కొవ్వూరు ఇన్‌చార్జి ఏఎస్‌వో నాగంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి పంచదార, కందిపప్పు అందించే విధంగా ప్రభుత్వం అందరికీ సరిపడే సరుకులు సరఫరా చేస్తుందన్నారు. ప్రతి డీలర్ విధిగా డీడీలు తీసి సరుకులు చేర్చుకోవాలన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి ఉదయం 6గంటలకే ప్రజా పంపిణీ ప్రారంభించాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో విద్యుత్ షాక్ గురై యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లికి చెందిన కొవ్వురు దుర్గాప్రపసాద్ జగన్నాథపురంలో ఒక ఇంటి నిర్మాణంలో రాడ్ బెండింగ్ పనిచేస్తుండగా ఇనుపరాడ్ పైనున్న విద్యుత్ తీగలకు తగలడంతో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అహరోన్ ఎంపిక

నిడదవోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని డొక్కా సీతమ్మ ఓరియంటల్ పురపాలక పాఠశాల విద్యార్థి కాకి అహరోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నాడని హెచ్ఎం నేతల భీమారావు, వ్యాయామోపాధ్యాయురాలు మూతిన వీరలక్ష్మి తెలిపారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో జరిగిన జిల్లా స్థాయి 600, 400 మీటర్ల పరుగు పందెంలో అహరోన్ ప్రథమస్థానంలో నిలిచాడని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలికిచర్ల శివారులో కోడిపందేల శిబిరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. 16మందిని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.9,400 నగదుతోపాటు 5 పందెం పుంజులు, 3 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్టు హెచ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్ట్స్ కాలేజీలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మోల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చున్నీలాల్ జాజూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు మోల్ భావనపై అవగాహన కల్పించారు. మోల్ శాస్త్రవేత్త కనుగొన్న ఒక సంఖ్యపై విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎం.పద్మజ, జి.తేజస్విని, ఎం.శాంతకుమారి, సీహెచ్ రజనీ, జే.శశిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు 'చల్లా' విరాళం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న జరుగనున్న ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవం నిమిత్తం ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు రూ.25 వేలు విరాళం అందించారు. బుధవారం ప్రిన్సిపాల్ పాలపర్తి ఎబెల్ రాజబాబుకు అందించారు.